సరస్వతి పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం 2





# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 23 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 107 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది

మృతులకు ప్రధాని మోడీ నివాళులు 2




ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు

# పెండింగ్ భూ సేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలె



## పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలె

పరిశ్రమల శాఖపై ఉన్నతాధికారుల సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనం బ్యూరో) : దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు పెండింగ్ భూ సేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం పరిశ్రమల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పలు కంపెనీలతో జరిగిన ఎంవోయూలు, పురోగతిపై సమీక్షలో చర్చించారు. వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూముల వివరాలను సీఎంకు అధికారులు తెలిపారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ది చేసి వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలనీ, పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరగా ఎంవోయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలనీ, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు.

# ఘోష్ కమిషన్ నివేదికపై స్టే

## కమిషన్ చట్టబద్ధమే.. నిబంధనలే పాటించలేదు

మాజీ సీఎం, మాజీ మంత్రికి ఊరటనిచ్చిన హైకోర్టు తీర్పు!

నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టొద్దు



హైదరాబాద్,ఏప్రిల్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలలో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఇరు పక్షాల వాదనలు ...మిగతా 2లో

'కాళేశ్వరం'అవినీతి బాధ్యులకు

# క్లీన్‌చిట్ ఇవ్వలేదు

## పూర్తి తీర్పును పరిశీలించి తదుపరి చర్యలు

ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో అన్నీ లోపాలే

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 2

# సీబీఐ విచారణకు సిద్ధమా?

నిజాయితీ ఉంటే ముందుకు రండి

బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్ 2

# కాంగ్రెస్ కుట్రలు బట్టబయలైనయ్?

హైకోర్టు తీర్పు తర్వాత హరీశ్ రావు 2

# 29 సమస్యల పరిష్కారానికి సిద్ధం

**ఒత్తిడితో కాదు.. సానుకూల వైఖరితోనే సమస్య పరిష్కారమవుతంది : మంత్రి పొన్నం**

**ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్ల విలువ రూ.35 వేల కోట్లు : ఎండీ నాగిరెడ్డి**

**మరో సకల జనుల సమ్మెగా మారుస్తం : ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న**

హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనం బ్యూరో) : ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంబంధించి మొత్తం 32 అంశాల్లో 29 సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మాకు కార్మికుల పట్ల నెగెటివిటీ లేదు. నిదులకు సంబంధించి ఉప ముఖ్యమంత్రితో చర్చిస్తున్నామని తెలిపారు. బుధవారం మంత్రి ఆర్టీసీ కార్మికుల సమ్మెపై స్పందిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెట్టాలని చూస్తున్నారనీ, సామరస్యంగా డిపోల్లో నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. మొట్టమొదటి సారిగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ వేశాం. చర్చలు జరుగుతుంటే మధ్యలోనే వెళ్లిపోయిన కొందరు నాయకులు చర్చలు విఫలం అంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ మొన్నటి సభలో మహాలక్ష్మి పథకం గురించి తప్పుగా మాట్లాడారనీ, ఎలాగైనా ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలి. తక్కువ చేసి చూపించాలని కుట్ర పన్నారని ఆరోపించారు. పేద ప్రజల లైఫ్ లైన్ అయినటువంటి ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తే ఊరుకోమని స్పష్టం చేశారు.


**ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్ల విలువ రూ.35 వేల కోట్లు : ఎండీ నాగిరెడ్డి**

ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్ల విలువ రూ.35 వేల కోట్లని ఆ సంస్థ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఆర్టీసీలో ఉన్న సమస్యలు కొత్తవి కావనీ, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందడుగు వేస్తోందనీ, సమ్మెను విరమించి వెంటనే చర్చల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 25 శాతం బస్సులు నడుస్తున్నాయనీ, ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఒక నెలలో ప్రస్తుతం రూ.700 కోట్ల ఆదాయం ఉంటుందనీ, సంఘాలు ...మిగతా 2లో

## పరిశ్రమలు, ఆవిష్కరణలకు విద్యా పునాది ముఖ్యం

మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు





ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి

## నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

హైదరాబాద్, ఏప్రిల్ 22 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా హైదరాబాద్లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఇవాళ తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. గురువారం ఆయన అంత్యక్రియలు పంజాగుట్ట శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984లో నెల రోజులపాటు ఉమ్మడి ఏపీ సీఎంగా పనిచేశారు. ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య హయాంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

**చంద్రబాబు సంతాపం..**

నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. భాస్కర రావు కుమారుడు, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ను సీఎం ఫోన్లో పరామర్శించారు.

**ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.. పవన్**

నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారని, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదని అన్నారు. ఆయన కుమారుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ పితృవియోగ బాధ నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# దేశంలో అత్యుత్తమ రోడ్ల నిర్మాణమే లక్ష్యం

రాష్ట్రంలో రూ.98 వేల కోట్లతో రహదారుల నిర్మాణం

నవంబర్‌లో హైటెక్స్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, మనం బ్యూరో : ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే కనీవిని ఎరుగని విధంగా రాష్ట్రంలో రూ.98 వేల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగంగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. బుధవారం ...మిగతా 2లో

# హజ్ యాత్రికులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలె

ఏర్పాట్లపై సమీక్ష సమావేశంలో మంత్రి అజారుద్దీన్

మంత్రి నాయకత్వంలో హైదరాబాద్ నుంచి యాత్రకు 10,000 మంది



హైదరాబాద్, ఏప్రిల్ 22 : తెలంగాణ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హజ్-2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుండి తన నేతృత్వంలో హజ్ యాత్రకు బయలుదేరనున్న సుమారు 10,000 మంది యాత్రికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ప్రపంచ స్థాయి ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖలకు ఆదేశించారు. హైదరాబాద్ నుండి జెడ్డాకు హజ్ చార్టర్ విమానాలు మే 4 నుండి ...మిగతా 2లో

## ఆరుగురు ఏడీజీలకు డీజీగా పదోన్నతి

కొత్త డీజీలకు డీజీపీ అభినందనలు 3

## రిటైర్డ్ ఉద్యోగికి 4 వారాల్లో పెన్షన్ చెల్లించాలి

హైకోర్టు కీలక వ్యాఖ్యలు 2

## 'ఎలక్ట్రిక్' ఛార్జింగ్ వసతులపై స్పెషల్ డ్రైవ్

ఛార్జింగ్ కేంద్రాలను పరిశీలించిన ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ 3

# ఆదివాసీలకు అద్భుత అవకాశం


పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగం 'రివర్స్ టూరిజం'

'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించిన జూపల్లి

250 మంది అడవి బిడ్డలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి



ఉట్నూరు, ఏప్రిల్ 22: రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, ...మిగతా 2లో








# అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు


- టెహ్రాన్ ఒక ప్రతిపాదనతో వచ్చేవరకు దాడులు చేయం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏక పక్ష ప్రకటన



వాషింగ్టన్, ఏప్రిల్ 22 : ఇరాన్ తో రెండోవిడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతుండగానే... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. పాకిస్థాన్ అభ్యర్థన ...మిగతా 2లో

# రెండు రాష్ట్రాల్లో నేడు పోలింగ్

- తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు..
- బెంగాల్‌లో తొలి విడత 152 స్థానాల్లో ఓటింగ్



చెన్నై, ఏప్రిల్ 22 : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు అంతా రెడీ అయింది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతాని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ ...మిగతా 2లో

## సరస్వతి పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, 2026 :** దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎన్. హనుమంతరావు బుధవారం లోక్ భవన్లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి పీపీటీ ఇచ్చారు. పుష్కరాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, ముఖ్య ఆలయాలు-వాటి ప్రాధాన్యత, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

## ఘోష్ కమిషన్ నివేదికపై స్టే

**(మొదటి పేజీ తరువాయి)**

సుదీర్ఘంగా విన్న జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం కాళేశ్వరం ఎత్తిపోతలపై కమిషన్ ఏర్పాటును సమర్థిస్తూ.. అది చట్టబద్ధమేనని తెలిపింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక తయారుచేసే సమయంలో ఎలాంటి నిబంధనలు పాటించలేదని కోర్టు అభిప్రాయపడింది. సెక్షన్ - 8 కింద నోటీసులు ఇవ్వకుండా నిరాధర ఆరోపణలు చేయడం సబబు కాదని తెలిపింది. నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఇదే కేసులో పిటిషన్‌లను దాఖలు చేసిన మాజీ సీఎస్ ఎస్కే జోషీతో పాటు నాటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌లకు కూడా ఊరట లభించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. తమ క్లయింట్లను నివేదిక రూపొందించే సమయంలో సాక్షులుగానే వివరాలు అడిగారని కోర్టుకు తెలిపారు. తీరా చూస్తే తన క్లయింట్లు తప్పు చేసినట్లుగా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. కమిషన్ ఎంక్వైరీ యాక్ట్ -1952 (సెక్షన్-8అ) (సెక్షన్-8ఇ) ప్రకారం ఎవరినైనా సాక్షులుగా విచారించినప్పుడు వారిపై ఎలాంటి అభియోగాలు మోపకూడదని గుర్తు చేశారు. ఒకవేళ ఆ అభియోగాలు నిజమైతే వేరుగా ఒక్కొక్కరికి నోటీసులిచ్చి విచారించాల్సి ఉంటుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు.

**కమిషన్‌పై పిటిషన్‌లు..**

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించి బ్యారేజీల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో నెం.6 సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్కే జోషిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. ఈక్రమంలో మార్చి 12న తీర్పును రిజర్వు చేసింది.ఈ మేరకు తాజా తీర్పుతో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు స్మితా సబర్వాల్, ఎస్కే జోషిలకు కూడా కోర్టు ఊరట కల్పించింది.

**మా వాదనలను..**

జస్టిస్ ఘోష్ కమిషన్‌పై తీర్పును ఈ నెల 8న వెలువరిస్తామని ప్రకటించినా కొంత ప్రక్రియ సిద్ధం కాకపోవడంతో కోర్టు ఏప్రిల్ 22కు వాయిదా వేసిన విషయం విదితమే. జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో ఉల్లంఘనలు జరిగాయని, అభియోగాలు మోపే ముందు తమ వాదనను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు న్యాయస్థానం ముందు పేర్కొన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా కమిషన్ వేశామంటూ, మరొకరి పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. మరోవైపు ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలపై కమిషన్ వేసినట్లు తెలిపారు.

**ప్రాజెక్టు వైఫల్యంపై :**

దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కేవలం మూడేళ్లకే కుంగిపోవడంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని, అక్కడ తప్పు జరిగిందన్నది అక్షర సత్యమని పేర్కొంది. ప్రాజెక్టు సైట్ ఎంపిక, డిజైన్లు, నిర్మాణంలో లోపాలున్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ , విజిలెన్స్ కమిషన్ ఇప్పటికే నివేదికలు సమర్పించాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా సుదీర్ఘ విచారణ తర్వాత ప్రాజెక్టులోని లోపాలు, అవకతవకలు, బాధ్యుల వివరాలను వెల్లడించింది.

**సీబీఐ దర్యాప్తు :**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొంటూ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. విజిలెన్స్ , ఎన్డీఎస్ఏ, ఘోష్ కమిషన్ నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని ప్రభుత్వం ఇప్పటికే సీబీఐకి లేఖ రాసింది. ఈ మేరకు గతేడాది సెప్టెంబర్ 1న ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ప్రభుత్వం జీవోతో పాటు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. హైకోర్టు వెలువరించిన పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుందని అధికార యంత్రాంగం వివరించింది.

**చెత్తబుట్టలో :**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలలో అవకతవకలపై హైకోర్టు తీర్పు వెలువడిన అనంతరం కేసీఆర్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు మీడియా ఎదుట కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పుతో పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును ఇక చెత్తబుట్టలో పడేయవచ్చని ఆయన అన్నారు. కమిషన్ విచారణలో సెక్షన్-8 నిబంధనలు పాటించలేదని కోర్టు గుర్తించిందని తెలిపారు. అయితే, కమిషన్ ఏర్పాటును మాత్రం కోర్టు సమర్థించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకుని సీబీఐ విచారణ జరపడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన వెల్లడించారు.

## దేశంలోనే అత్యుత్తమ రోడ్ల నిర్మాణమే లక్ష్యం

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్ర సచివాలయంలో రహదారుల నిర్మాణం, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. 2028 చివరి నాటికి రోడ్ల నిర్మాణంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దేశంతో పాటు ప్రపంచం నలు మూలల నుండి రోడ్డు కాంట్రాక్టర్లు, బిల్డర్లు హాజరయ్యే ప్రతిష్టాత్మక ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ సమావేశం ఈ ఏడాది నవంబర్‌లో హైటెక్స్‌లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ సమావేశం నిర్వహణకు బీజేపీ పాలనలోని రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ కేంద్ర మంత్రి గడ్కరీ తన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో నిర్వహించేందుకు అనుమతించినట్లు చెప్పారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రానికి చెందిన మోహన్ నాయక్ ఎన్నికైన విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి గుర్తు చేశారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశం అనంతరం రాష్ట్రానికి సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. రూ.148 కోట్లతో నిర్మించనున్న అప్రోచ్ రహదారులతో 300 గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం సమావేశాలు నిర్వహించి వదిలేయడం తప్ప అప్రోచ్ రోడ్లకు నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.36 వేల కోట్లు మంజూరయ్యాయనీ, ఇది రాష్ట్రానికి గేమ్ చేంజర్ ప్రాజెక్టని చెప్పారు. ఈనెల 8న రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం భూ సేకరణకు రాష్ట్రవాటాగా రూ.628 ఎన్‌హెచ్ఏఐకి జమ చేశామని వెల్లడించారు. రహదారుల నిర్మాణంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివస్తాయనీ, తద్వారా స్థానిక యువతకు పెద్ద మొత్తంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఎల్బీ నగర్-హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను రూ. 941 కోట్లతో చేపడుతున్నామనీ, ఇందులో కేంద్రం వాటా రూ.741 కోట్లు కాగా, రాష్ట్రం రూ.200 కోట్లు ఖర్చు చేయనుందని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

## హజ్ యాత్రికులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలె

**(మొదటి పేజీ తరువాయి)**

మే 21, 2026 వరకు నడవనున్నాయి. తిరుగు ప్రయాణ విమానాలు మదీనా నుండి హైదరాబాద్కు జూన్ 11 నుండి జూన్ 26, 2026 వరకు కొనసాగనున్నాయి. వృద్ధులు, మహిళలు, తొలిసారి హజ్ యాత్రకు వెళ్తున్న వారు గౌరవప్రదంగా, ప్రశాంతంగా తమ ఆధ్యాత్మిక యాత్ర పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఆదివాసీలకు అద్భుత అవకాశం

**(మొదటి పేజీ తరువాయి)**

సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు.

**ఆదివాసీలతో మమేకమైన మంత్రి**

కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 'బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**నగర నాగరికతకు – సంస్కృతికి వారధి**

ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

## 29 సమస్యల పరిష్కారానికి సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**

కావాలని సమ్మెలోకి వెళితే నష్టాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సమ్మె విరమించండి, చర్చలకు రండి, ఆర్టీసీని కాపాడండి అని ఈ సందర్భంగా నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలన్నారు. ఈమేరకు బుధవారం వెంకన్న మీడియాతో మాట్లాడుతూ అమరవీరులకు నివాళులు అర్పించి సమ్మెను ముందుకు తీసుకెళతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారనీ, ఈ సమ్మెను మరో సకల జనుల సమ్మెగా మారుస్తమని తెలిపారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీని వేసిందని విమర్శించారు. కమిటీ అవసరమే లేదనీ ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వమే తక్షణం నెరవేర్చాలని ఈ సందర్భంగా వెంకన్న డిమాండ్ చేశారు.

## రెండు రాష్ట్రాల్లో నేడు పోలింగ్

**(మొదటి పేజీ తరువాయి)**

తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది.

**పశ్చిమ బెంగాల్లో 152 స్థానాల్లో..**

పశ్చిమబెంగాల్లో తొలి విడతకు సర్వం సిద్ధమైంది. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది.

## అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు

**(మొదటి పేజీ తరువాయి)**

మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు.

అమెరికా- ఇరాన్ మధ్య ఈనెల 8న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల విరమణ ముగియడానికి కొన్ని గంటల ముందు దీన్ని పొడిగిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ ల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సంఘర్షణ ముగించేందుకు ఇరాన్ ఒక ప్రతిపాదనతో ముందుకు వచ్చేవరకు దానిపై దాడులు చేయమన్నారు. అయితే, హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇరాన్లోని అంతర్గత కలహాలే తదుపరి చర్చలు విఫలమవడానికి కారణమని ఈసందర్భంగా ట్రంప్ ఆరోపించారు. ఇక, తమ అభ్యర్థన మేరకు కాల్పుల విరమణను పొడిగించినందుకు ట్రంపునకు పాక్ ప్రధాని షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కొనసాగుతోన్న దౌత్య ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇది వీలు కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది

### మృతులకు ప్రధాని మోడీ నివాళులు

**ఢిల్లీ, ఏప్రిల్ 22 :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాదైంది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోడీ నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ..'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.

పహల్గామ్‌లో ఉగ్ర దాడి దేశం మొత్తాన్ని కలచివేసిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ విషాదాన్ని, ఇందులో మరణించిన అమాయకులను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. ఆ దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలోనూ దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదని స్పష్టంచేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎప్పటికీ సఫలం కావన్నారు. కాగా.. గతేడాది ఏప్రిల్ 22న పర్యాటకులపై ముష్కరులు విచక్షణారహితంగా దాడి చేశారు. హిందువులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ప్రపంచమంతా తీవ్రంగా ఖండించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల క్యాంపులను నేలమట్టం చేసింది.

## రిటైర్డ్ ఉద్యోగికి 4 వారాల్లో పెన్షన్ చెల్లించాలి

- హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఏప్రిల్ 22(మనం, ప్రత్యేక ప్రతినిధి) :** రిటైర్డ్ ఉద్యోగులకు అందవలసిన పదవీ విరమణానంతరం పెన్షన్ చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఆరు నెలల క్రితం పదవీవిరమణ పొందిన విజయ్ కుమార్‌కు రావాల్సిన రూ. 90 లక్షల బెనిఫిట్స్ అందలేదు. దీనిపై ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, తెలంగాణ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి కఠిన ఆదేశాలు జారీ చేసింది. విజయకుమార్‌కు అందాల్సిన పెన్షన్ ప్రయోజనాలను రాబోయే 4 వారాల్లోగా పూర్తిస్థాయిలో చెల్లించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా ఈ చెల్లింపులు జరగకపోతే, టోకెన్ జారీ చేసిన తేదీ నుంచి 18 శాతం వార్షిక వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వృద్ధాప్యంలో తమ కష్టార్జితం కోసం ఉద్యోగులు కోర్టుల చుట్టూ తిరగడం సరికాదని, తక్షణమే ఈ బకాయిలను విడుదల చేయాలని న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశించింది.

## కాంగ్రెస్ కుట్రలు బట్టబయలైనయ్?

### కక్షసాధింపులు మాని రైతుల ప్రయోజనాలు కాపాడండి
### హైకోర్టు తీర్పు తర్వాత ప్రభుత్వానికి హరీశ్ రావు సూచన

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, తాజా తీర్పు కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. 'ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయస్థానాల్లో న్యాయమే గెలుస్తుందని, సత్యమే నిలుస్తుందని మరోసారి రుజువైంది' అని ఆయన కామెంట్ చేశారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరించి జరిపిన విచారణను హైకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వివరించారు. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాటకాలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ బురదజల్లుడు ఆపి, దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.

## పరిశ్రమలు, ఆవిష్కరణలకు విద్యా పునాది ముఖ్యం

- మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనం బ్యూరో) :** రాష్ట్రం పరిశ్రమలు, ఆవిష్కరణల ఆధారిత రంగాల్లో పురోగమిస్తున్న తరుణంలో విద్యా పునాదిని బలోపేతం చేయడం ఎంతో ముఖ్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. ఈ ప్రయత్నంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా చేయడం ద్వారా సమ్మిళిత అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా మలబార్ గోల్డ్, డైమండ్స్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.200 కోట్ల నిధుల కేటాయింపును ప్రకటించింది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణలోని 5050 మంది విద్యార్థులకు రూ.4.55 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కార్పొరేట్ కంపెనీలు తాము ఆర్జించిన ఆదాయంలో 2 శాతం ఖర్చు చేయాలని నిర్దేశిస్తే మలబార్ గోల్డ్, డైమండ్స్ కంపెనీ అంతకంటే ఎక్కువగా 5 శాతం ఖర్చు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ విద్యార్థి పేదరికం కారణంగా చదువుకు దూరం కావొద్దన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మీరు కలలు కనడం ఆపొద్దు...మీ ఆలోచనలు, ఆశయాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక స్థాయిలో దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టించడంలో విద్య అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. స్కాలర్‌షిప్ కార్యక్రమాల ద్వారా విజయం సాధించగల సామర్థ్యం ఉన్న విద్యార్థులు చదువులను కొనసాగించడానికి మద్దతు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మలబార్ గోల్డ్, డైమండ్స్ సంస్థ ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్ ఓ మాట్లాడుతూ సంస్థను స్థాపించిన 1993 నుండే తాము కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా పేద విద్యార్థులకు ఆహారం, స్కాలర్‌షిప్‌లు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రిటైల్ హెడ్ సిరాజ్, హైదరాబాద్ జోనల్ హెడ్ షరీజ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలకు సాంకేతిక పరిజ్ఞానం కీలకం

### అంబేద్కర్ వర్సిటీలో ఉన్నతవిద్య.. డిజిటల్ పరివర్తన సదస్సులో ప్రవీణ్ ప్రకాష్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** విశ్వవిద్యాలయాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. అంబేద్కర్ వర్శిటీలో బుధవారం ఉన్నత విద్యలో డిజిటల్ పరివర్తన అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా క్రెడిట్ ఆధారిత ఆన్‌లైన్ కోర్సుల కోసం స్వయం వేదికను ఏర్పాటు చేసారని, ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాలు సొంతంగా పూర్తి ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారని, అదేవిధంగా యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండే లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా విద్యార్థులకు విద్యను అందించడానికి సంపూర్ణ అధ్యయన వేదికలను ఏర్పాటు చేసుకున్నారన్నారు.

### 'కాళేశ్వరం'అవినీతి బాధ్యులకు
## క్లీన్‌చిట్ ఇవ్వలేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనం బ్యూరో) :** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పులో అవినీతికి బాధ్యులు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందేనని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్టు తీర్పుపై చర్చించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారనీ, కానీ జ్యుడిషియల్ ఏర్పాటును కోర్టు తప్పు పట్టలేదని పేర్కొన్నారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పు పట్టలేదనీ, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంస్ నం.6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదనీ, అసమంజసం కాదని కూడా న్యాయస్తానం స్పష్టం చేసిందని తెలిపారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసులు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందనీ, జ్యుడీషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదనీ, న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తరువాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయింది ముమ్మాటికీ నిజమనీ, ప్రాజెక్టును ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నిర్మాణాలు, నిర్వహణ అన్ని చోట్ల అవకతవకలు జరిగాయనీ, అన్నీ లోపాలే ఉన్నాయనీ, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా కమిషన్ చేసిన రిమార్కులపై మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందన్నారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదనీ, తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతీ ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమనీ, దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందనీ, దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## సీబీఐ విచారణకు సిద్ధమా?

- నిజాయితీ ఉంటే ముందుకు రండి
- బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు సవాల్ విసిరారు.

కాళేశ్వరం అంశంపై హైకోర్టు క్లీన్ చీట్ ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి గారు తీవ్రంగా విమర్శించారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని, భారీ ఆర్థిక దోపిడీ, కమీషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి గారు అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యతపై ఇప్పటికే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాలు కుంగిపోవడం, పంప్ హౌజ్లు దెబ్బతినడం వంటి సంఘటనలు యాదృచ్ఛికం కాదని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రాజెక్టులో జరిగిన పెద్ద ఎత్తున అవినీతికి నిదర్శనాలేనని పేర్కొన్నారు.

ఆనాటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత దెబ్బతిందని, అదే విధంగా నిర్మించిన చెక్ డ్యాములు కూడా కుప్పకూలిన ఘటనలు ప్రజల ముందు ఉన్న వాస్తవాలేనని మంత్రి గారు గుర్తు చేశారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టో ఎలాంటి అవినీతి జరగలేదన్నట్టుగా గ్లోబల్ ప్రచారానికి దిగడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, ఇది టీఆర్ఎస్ పాలనలో పెరిగిన మాయాజాల రాజకీయాలే అని విమర్శించారు. నిజాన్ని దాచేందుకు ప్రచార యంత్రాంగాన్ని వినియోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

బీఆర్ఎస్ నాయకత్వం, ముఖ్యంగా కేసీఆర్ మరియు కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, విచారణ నుంచి ఎందుకు తప్పించుకుంటున్నారో చెప్పాలని మంత్రి గారు డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టులపై పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరగడం ప్రజాస్వామ్యంలో కనీస బాధ్యత అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టో ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. నిజం మీవైపు ఉంటే విచారణకు ముందుకు రావాలని లేకపోతే మీ భయం మీ తప్పును నిరూపిస్తుందన్నారు.

## హర్మూజ్ దిగ్బంధించామంటున్న ట్రంప్ మాటలు ఉత్తుత్తివేనా?

**టెహ్రాన్, ఏప్రిల్ 22 :** హర్మూజ్ జలసంధిని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకున్నామని, దిగ్బంధన వ్యూహం 'సూపర్ సక్సెస్' అయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. అయితే, అక్కడి వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దాదాపు 900 మిలియన్ డాలర్లకు పైగా విలువైన చమురుతో కూడిన 34 ఇరాన్ సంబంధిత ట్యాంకర్లు హర్మూజ్ను దాటి వెళ్లినట్లు తెలిపాయి. వీటిలో 19 ట్యాంకర్లు ఇరాన్కు చెందినవి కాగా.. మిగిలిన 15 నౌకలు అరేబియా సముద్రం నుంచి ఇరాన్ వైపుగా గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. హర్మూజ్ను దాటి వెళ్లిన 6 నౌకల్లో ఇరాన్ ముడిచమురు రవాణా చేసినట్లు సమాచారం.

ఏప్రిల్ 13న హర్మూజ్ దిగ్బంధనానికి అమెరికా పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇరాన్ పోర్టులకు నౌకల రాకపోకలను అడ్డుకుంటామని ప్రకటించింది. ఈ మేరకు తన నేవీని రంగంలోకి దించింది. పరిమిత దేశాలకు చెందిన నౌకలను మాత్రమే అనుమతించేలా చర్యలు చేపట్టింది. అయితే, కొన్ని అంతర్జాతీయ కథనాల ప్రకారం.. ఇప్పటివరకు అమెరికా దళాలు కేవలం ఒక్క నౌకను మాత్రమే అడ్డుకోగా.. ఇండో-పసిఫిక్లో ఆంక్షలకు గురైన మరో ట్యాంకర్ను తనిఖీ చేసినట్లు చెబుతున్నాయి. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన దీనికి విరుద్ధంగా ఉంది. మొత్తం 28 నౌకలను ఇరాన్ పోర్టులకు వెళ్లనీయకుండా వెనక్కి తిప్పి పంపినట్లు సెంట్రల్ కమాండ్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

# ప్రజాసేవలో 'ఫైలు' వెనుక ఉన్న 'మనిషి'ని మర్చిపోవద్దు

- అది కేవలం కాగితం కాదు.. ఒకరి జీవితాన్ని మార్చే శక్తి
- క్షేత్రస్థాయిలో మీ విచక్షణే అసలైన పరీక్ష
- మీ నిర్ణయమే పౌరుడికి ప్రభుత్వ ముఖచిత్రం
- మేధస్సు కంటే చిత్తశుద్ధే ముఖ్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గ్రూప్-1 అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం





**హైదరాబాద్,ఏప్రిల్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి):** 'మీరు సంతకం చేసే ప్రతి ఫైలు వెనుక ఒక సామాన్యుడి ఆశ ఉంటుంది. ఆ ఫైలును కేవలం కాగితంలా చూడకండి.. అది ఒకరి జీవితాన్ని మార్చే శక్తి అని గుర్తుంచుకోండి' అని నూతనంగా ఎంపికైన గ్రూప్-1 అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఐఖఐఖ)లో ఆరు వారాల పాటు జరిగిన గ్రూప్-1 ఫౌండేషన్ కోర్స్ (బ్యాచ్-ఐఐ) ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 214 మంది అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రజా సేవలో పాటించాల్సిన నైతిక విలువలు, పరిపాలనలో మానవీయ కోణాన్ని మర్చిపోవద్దని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. పరిపాలనలో వేగం పెరగాలని, ప్రతి నిర్ణయం పేదవాడి దరి చేరాలని అధికారులకు సూచించారు. 'వ్యవస్థలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి, కానీ అందులో పనిచేసే వ్యక్తులు చూపే సానుభూతి (ఉఝఞ్ఞౌజిఉ) మాత్రమే మార్పును తెస్తుంది. రైతు ఆశ, విద్యార్థి కల, రోగి ప్రాణం.. ఇవన్నీ మీరు తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయి. చట్టాలకు లోబడి ఉంటూనే, మానవీయ కోణంలో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఫైళ్లు, సమీక్షల హడావుడిలో పడి సామాన్యుడిని విస్మరించవద్దు. రైతు సాయం, విద్యార్థి స్కాలర్‌షిప్, రోగి ఆరోగ్యం మీ కలంపైనే ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో మీ మేధస్సు నిరూపితమైంది, కానీ క్షేత్రస్థాయిలో మీ విచక్షణకు పరీక్ష ఎదురవుతుంది. ఒత్తిళ్లకు లొంగకుండా నైతిక విలువలతో పనిచేసినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న సమ్మిళిత వృద్ధిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే అని గుర్తు చేశారు. నేటి ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరియు డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో వాడుకోవాలని, అయితే సాంకేతికత ఎన్నటికీ 'మానవత్వం'తో కూడిన సానుభూతిని భర్తీ చేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరా మహిళా శక్తి' వంటి ప్రతిష్టాత్మక పథకాలను ప్రజలకు చేరవేయడంలో యువ అధికారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మీరు మాట్లాడే తీరు, వారిని గౌరవించే విధానమే ప్రభుత్వానికి అసలైన ముఖచిత్రం' అని ఆయన స్పష్టం చేశారు.

'ఒక పింఛను సకాలంలో అందడం, ఒక చిన్న సమస్య పరిష్కారం కావడం ద్వారానే సుపరిపాలన పునాదులు బలపడతాయి. తెలంగాణ భవిష్యత్తు కేవలం సచివాలయంలోనే కాదు, మీ నిర్ణయాల ద్వారా గ్రామాలు, మండలాల్లో రూపుదిద్దుకుంటుంది' అని పేర్కొంటూ నూతన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అది నిష్పాక్షికంగా ఉందా? నిజాయితీగా ఉందా? అని ఒక్కసారి సరిచూసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో నెగ్గి మీ మేధస్సును నిరూపించుకున్నారని, అయితే క్షేత్రస్థాయిలో మీ నిజాయితీ (ఖ్ఞిఖుఝ్ట్జీఢ) మాత్రమే మీకు గుర్తింపు తెస్తుందని స్పష్టం చేశారు. 'ప్రలోభాలు ఎదురైనప్పుడు, ఒత్తిళ్లు వచ్చినప్పుడు మీ విచక్షణే మీకు రక్షణ కవచం. రాజీ పడటం సులభం కావచ్చు, కానీ నిబద్ధతతో నిలబడటమే అసలైన ప్రజా సేవ. ప్రభుత్వ ప్రతిష్ట మీ నడవడికపైనే ఆధారపడి ఉంటుంది' అని హితవు పలికారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానీ సహచార క్యాబినెట్ మంత్రులు అధికారాన్ని అనుభవించడం కోసం పనిచేయడం లేదని , ఆ అధికారాన్ని ఒక ఆయుధంగా మలుచుకుని కోట్లాది మంది తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించి, వారి భవిష్యత్తుకు భరోసానివ్వడమే తమ అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం విద్య, వైద్యం మరియు మౌలిక సదుపాయాల కల్పనపై భారీగా పెట్టుబడులు పెడుతోందని ఆయన వివరించారు. ఈ రంగాలపై వెచ్చిస్తున్న ప్రతి రూపాయిని ఏదో 'ధర్మం' చేస్తున్నామని తాము అనుకోవడం లేదని, మన మానవ వనరులే రాష్ట్రానికి నిజమైన బలం అని బలంగా నమ్ముతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. బాల్యం నుంచే మన పిల్లల నైపుణ్యాలకు పదును పెడితే వారు ప్రపంచంతో పోటీపడగలరని, అప్పుడే మన అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని ఆయన ఆకాంక్షించారు. ఇదే నమ్మకంతో ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించి మిమ్మల్ని ఈ ఉన్నత స్థితికి తీసుకొచ్చాయని, ఆ వ్యవస్థ పట్ల కృతజ్ఞతతో ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూనే, మిమ్మల్ని ఇంతటి వారిని చేసిన ఈ రాష్ట్రానికి మీరు తిరిగి ఏమి ఇవ్వగలరో ఆలోచించాలని కోరారు. మీ మేధస్సు, సేవలు ఈ రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని, ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎం సి హెచ్ ఆర్ డి జనరల్ డైరెక్టర్ శాంతి కుమారి, కోర్సు డైరెక్టర్ అరుణ్ కుమార్, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# 'ఎలక్ట్రిక్' ఛార్జింగ్ వసతులపై స్పెషల్ డ్రైవ్

## ఛార్జింగ్ కేంద్రాలను పరిశీలించిన ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్



**హైదరాబాద్,ఏప్రిల్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి):** నగరంలోని ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ మౌలిక వసతులపై అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్ తన సిబ్బందితో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈక్రమంలో శర వేగంగా అభివృద్ధి చెందుతున్న కోకాపేట్ కారిడార్, ఛార్జ్‌జోన్, పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్‌లలో ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ మిషన్‌లను డీజీ పరిశీలించారు. ముఖ్యంగా నివాస ప్రాంతాలలోని ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ కేంద్రాలో అగ్నిమాపక శాఖ నిబంధనలు లోబడి ఉండాలని, అవసరమైన అగ్నిమాపక భద్రత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అనంతరం కోకాపేట్‌లోని పబ్లిక్ ఛార్జింగ్ కేంద్రంలో, డైరెక్టర్ జనరల్ సాంకేతిక నిపుణులతో సమావేశమై, అధిక సామర్థ్య ఫాస్ట్ ఛార్జర్ల ఆపరేషనల్ భద్రతను పరిశీలించారు. ముఖ్యంగా ఎర్త్-లీకేజ్ రక్షణ, థర్మల్ మానిటరింగ్ వ్యవస్థలు, విద్యుత్ ఉధృతి సమయంలో ఆటోమేటిక్ షట్‌డౌన్ వంటి కీలక వైఫల్య నివారణ వ్యవస్థలపై సమీక్షించారు. అదేవిధంగా అధిక వినియోగం ఉన్న ప్రదేశంలో ఈ వ్యవస్థలను పరిశీలించడం ద్వారా, పబ్లిక్ మౌలిక వసతులకు సంబంధించిన ప్రమాదాలను గుర్తించి, భవిష్యత్ అగ్నిమాపక భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసే అవకాశాలపై చర్చించారు.

**వసతులపై పరిశీలన :**

డీజీఎఫ్ఎస్ కోకాపేట్‌లోని భారీ భవనాన్ని సందర్శించిన అనంతరం నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల అనుసంధానం వల్ల ఎదురయ్యే సవాళ్లను డీజీ అవగతం చేసుకున్నారు. ప్రైవేట్ ఛార్జింగ్ యూనిట్, నివాస స్లో ఛార్జర్లను పరిశీలించి, గృహ విద్యుత్ వ్యవస్థలు నిరంతర అధిక లోడ్‌ను ఎలా నిర్వహిస్తున్నాయో అధ్యయనం చేశారు. ముఖ్యంగా, పార్కింగ్ ప్రాంతాల్లో అగ్నిమాపక భద్రతా చర్యలు, అలాగే ప్రస్తుత భవన అగ్నిమాపక వ్యవస్థలు వినియోగానికి తగినవేనా అన్న అంశాలను విశ్లేషించారు. ఈ సందర్భండా డీజీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ "గరంలోని ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ మౌలిక వసతులపై ప్రత్యక్ష పరిశీలనల ద్వారా సేకరించిన సమాచారం సమగ్ర రాష్ట్ర నిబంధనల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రీన్ ఎనర్జీ వైపు మార్పును ప్రోత్సహించడంతో పాటు, ప్రజా భద్రతను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకుండా ఉండేలా నియంత్రణ వ్యవస్థను రూపొందించడంలో ఈ పరిశీలనలు ఉపయోగపడతాయన్నారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మారుతున్న ఈ సమయంలో అగ్నిమాపక శాఖ సూచనలు,ఆదేశాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు ఏడీజీలకు డీజీగా పదోన్నతి

## కొత్త డీజీలకు డీజీపీ అభినందనలు



**హైదరాబాద్,ఏప్రిల్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో భారీ పదోన్నతులు కల్పించింది. ఆరుగురు ఏడీజీలకు డీజీ హోదా కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1995 బ్యాచ్ కు చెందిన ఏడీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావుకు డీజీ హోదా కల్పించారు. అదేవిధంగా 1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్ కుమార్, సజ్జనార్ లకు డీజీ ర్యాంకులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఆరుగురు అధికారులు తమకు పదోన్నతి లభించినప్పటికీ ప్రస్తుతం వారు ఏ బాధ్యతలలో ఉన్నారో అదే పోస్టింగ్‌లో కొనసాగనున్నారని ప్రభుత్వం స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు వీరు తమ ప్రస్తుత విభాగాల్లోనే డీజీ హోదాలో సేవలందించనున్నారు.

**డీజీపీ అభినందనలు :**

రాష్ట్రంలో 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన ఆరుగురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతి లభించిండంతో ఆయా అధికారులకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. 1995 సంవత్సరం బ్యాచ్ కు చెందిన వీరిశెట్టి వెంకట శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ మురళీధర్ భగవత్ లతో పాటు 1996 బ్యాచ్ కు చెందిన చారు సిన్హా, డాక్టర్ అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ లను ఈ సందర్భంగా డిజిపి అభినందించారు.

# ఆర్‌టీసీ ఆస్తులు ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి
- తలసాని డిమాండ్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఎట్టకేలకు తెలంగాణలో ఆర్‌టీసీ కార్మికుల సమ్మె ప్రారంభమయింది. రాష్ట్రవ్యాప్తంగా బస్సులు ఎక్కడికక్కడ డిపోలకే పరిమితమయ్యాయి. ఆర్‌టీసీ సమ్మె కారణంగా సాధారణ ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లను ఎందుకు నియమిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అనుభవం ఉన్న ఆర్‌టీసీ ఉద్యోగులనే ఆ బస్సులకు కేటాయించాలని, తద్వారా వారి ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఆర్‌టీసీకి చెందిన విలువైన డిపోలు, ఆస్తులను ప్రైవేట్ సంస్థలపరం చేయడం ఏంటని నిలదీశారు. ఇది సంస్థను నిర్వీర్యం చేయడమేనని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి, ఇప్పుడు సమ్మె వల్ల వారిని ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. పేదలు, విద్యార్థులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని తలసాని డిమాండ్ చేశారు.

# పరిశ్రమలు, ఆవిష్కరణలకు విద్యా పునాది ముఖ్యం

## మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనం బ్యూరో) :** రాష్ట్రం పరిశ్రమలు, ఆవిష్కరణల ఆధారిత రంగాల్లో పురోగమిస్తున్న తరుణంలో విద్యా పునాదిని బలోపేతం చేయడం ఎంతో ముఖ్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. ఈ ప్రయత్నంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా చేయడం ద్వారా సమ్మిళిత అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా మలబార్ గోల్డ్, డైమండ్స్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.200 కోట్ల నిధుల కేటాయింపును ప్రకటించింది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణమండపంలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణలోని 5050 మంది విద్యార్థులకు రూ.4.55 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కార్పొరేట్ కంపెనీలు తాము ఆర్జించిన ఆదాయంలో 2 శాతం ఖర్చు చేయాలని నిర్దేశిస్తే మలబార్ గోల్డ్, డైమండ్స్ కంపెనీ అంతకంటే ఎక్కువగా 5 శాతం ఖర్చు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ విద్యార్థీ పేదరికం కారణంగా చదువుకు దూరం కావొద్దన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మీరు కలలు కనడం ఆపొద్దు...మీ ఆలోచనలు, ఆశయాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక స్థాయిలో దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టించడంలో విద్య అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. స్కాలర్‌షిప్ కార్యక్రమాల ద్వారా విజయం సాధించగల సామర్థ్యం ఉన్న విద్యార్థులు చదువులను కొనసాగించడానికి మద్దతు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మలబార్ గోల్డ్, డైమండ్స్ సంస్థ ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్ ఓ మాట్లాడుతూ సంస్థను స్థాపించిన 1993 నుండే తాము కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా పేద విద్యార్థులకు ఆహారం, స్కాలర్‌షిప్‌లు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రిటైల్ హెడ్ సిరాజ్, హైదరాబాద్ జోనల్ హెడ్ షరీజ్ తదితరులు పాల్గొన్నారు.

# నా ఎదుగుదల ఓర్వలేకనే..

- బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ కుట్రలు పన్నినయ్?
- నేను ఏ పార్టీలో చేరను.. అ(ఇ)ందులో ఎలాంటి వాస్తవం లేదు : జీవన్ రెడ్డి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** నా రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం బీఆర్ఎస్ సీనియర్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి బీజేపీలోకి చేరుతారని కొన్నిరోజులుగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంపై జీవన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోందని, ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి తనపై కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు కేసీఆర్ వెంటే ఉంటానని అన్నారు. ఆయన నాయకత్వంలో పని చేయడం తనకు గర్వకారణమని అన్నారు. తాను బీజేపీలో చేరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలు, అభిమానులు ఇలాంటి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. తాను ఎప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే సైనికుడిగా కొనసాగుతామని స్పష్టం చేశారు.

# ఆదిశంకరాచార్యుల జయంతి వేడకలు



**ధర్మవరం అర్బన్ ఏప్రిల్ 22 మనం న్యూస్:** ధర్మవరం పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూజారి ధనుంజయఆచారి ఆధ్వర్యంలో శంకరాచార్యులకు ప్రత్యేక చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పూజారి ధనుంజయఆచారి మాట్లాడుతూ శంకరాచార్యులు జీవించింది 32 ఏళ్లు మాత్రమే అయినా విశ్వగురువుగా ఖ్యాతి పొందారన్నారు. మహనీయుడు నడిచే దైవం ఆదిశంకరాచార్యులన్నారు. తన బోధనలతో అశేష జనావళిని ఆధ్యాత్మికంగా జాగృతం చేసి, సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన జగద్గురువులు ఆదిశంకరాచార్యులన్నారు.

# ఉక్కపోతతో భారీ ముప్పు



- ఉష్ణోగ్రతలే కాదు.. ఊపిరిసలపనివ్వని ఉక్కపోత డేంజర్
- వేసవిలో తీవ్రమైన వడగాల్పులు తప్పవని ఐఎండీ హెచ్చరిక
- పొడి వేడి కన్నా..గాలిలో తేమ వేడే అత్యంత ప్రమాదకరం
- శరీరాన్ని చల్లబరిచే చెమట వ్యవస్థ పనిచేయదని వెల్లడి
- 31 డిగ్రీల వెట్-బల్బ్ ఉష్ణోగ్రతకే మానవ శరీరం విఫలమవుతుందన్న కొత్త అధ్యయనం
- భారత తీరప్రాంతాలు, రుతుపవన ప్రాంతాలకు ముప్పు అధికం : నిపుణుల హెచ్చరిక

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఇప్పటివరకు ఓ లేక్క... ఇప్పటి నుంచి మరో లేక్క... అవును ఈ ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ మధ్య దేశంలోని తూర్పు, మధ్య, ద్వీపకల్ప ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వడగాల్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. 2026 వేసవి కొత్త రికార్డులను సృష్టించవచ్చని అంచనా వేస్తున్న తరుణంలో, ప్రజలు కేవలం అధిక ఉష్ణోగ్రతల గురించే కాకుండా, గాలిలో తేమతో కూడిన వేడి (ఉక్కపోత) వల్ల కలిగే ప్రాణాంతక ముప్పు గురించి తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**తేమతో కూడిన వేడి ఎందుకు ప్రమాదకరం?**

మానవ శరీరం చెమట ద్వారా తనను తాను చల్లబరుచుకుంటుంది. చర్మంపై చెమట ఆవిరిగా మారే ప్రక్రియలో శరీరం నుంచి వేడి బయటకు వెళ్ళిపోతుంది. రాజస్థాన్, ఢిల్లీ వంటి ప్రాంతాలలో ఉండే పొడి వేడిలో ఈ ప్రక్రియ సక్రమంగా పనిచేస్తుంది. కానీ, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, అది ఇప్పటికే నీటి ఆవిరితో నిండి ఉండటంతో చర్మంపై చెమట ఆవిరి కాలేదు. దీనివల్ల శరీరం చల్లబడే ప్రక్రియకు ఆటంకం కలుగుతుంది. ఫలితంగా గుండె వేగం పెరగడం, అధిక రక్తపోటు, కొన్ని తీవ్రమైన సందర్భాల్లో అవయవాలు విఫలమవడం, మరణం సంభవించడం వంటివి జరుగుతాయి.

**కొత్త పరిశోధనలో కీలక విషయాలు**

శాస్త్రవేత్తలు ఈ ఉమ్మడి ముప్పును 'వెట్-బల్బ్ టెంపరేచర్' (గిఆఖీ) తో కొలుస్తారు. ఇది కేవలం గాలి ఉష్ణోగ్రతనే కాకుండా తేమను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. గతంలో మానవ శరీరం 35 డిగ్రీల సెల్సియస్ గిఆఖీ వరకు తట్టుకోగలదని భావించేవారు. అయితే, పెన్ స్టేట్ యూనివర్సిటీ ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. ఆరోగ్యంగా, దృఢంగా ఉన్న యువకులు కూడా కేవలం 31 డిగ్రీల గిఆఖీ వద్ద తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకునే సామర్థ్యాన్ని కోల్పోతున్నట్లు కనుగొన్నారు. ఉదాహరణకు, 38 డిగ్రీల ఉష్ణోగ్రత, 60 శాతం తేమ కలిస్తే ఈ ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. భారతదేశం వంటి తీరప్రాంతాలు, రుతుపవనాల ప్రభావం అధికంగా ఉండే దేశానికి ఈ ముప్పు మరింత ఎక్కువ. 'చాలామందికి పొడి వడగాల్పుల గురించి అవగాహన ఉంది, కానీ తేమతో కూడిన వేడి గురించి తెలియదు. అందుకే ఇది మరింత ప్రమాదకరం' అని రీడింగ్ యూనివర్సిటీకి చెందిన అక్షయ్ దేవరస్ వివరించారు. ఐపీసీసీ నిపుణుడు అంజల్ ప్రకాష్ మాట్లాడుతూ, 'వాతావరణ మార్పుల వల్ల 40 డిగ్రీల ఉష్ణోగ్రత 50 డిగ్రీలలా అనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో ఏసీ లేకుండా జీవించడం అసాధ్యం' అని హెచ్చరించారు.

## ఎండజల్లు

ఎడతెరిపి లేకుండా
కురుస్తోంది ఎండ
ఏ ఎండకా గొడుగేమోకానీ
ఏ గొడుగు పట్టినా
నిలువ నీడలేకుండా
చేస్తోంది ఎండ

ఎండ కురవని చోటంటూ లేదు
డాబాల్లో వుంటే
మాడిన పెనంలాగా మండించి
మసి చేస్తోంది

గుడిసెల్లో వుంటే
చిల్లులగుండా కురిసి
నిప్పుల వానలా
మీద దాడిచేస్తోంది

చెట్టెక్కటే ఈ ఎండ జల్లును
నిలువరించే ఆయుధమని
వెతకుతూ పోతే
చెట్టు ఆచూకీ ఎక్కడా దొరక్క
ఎండ చినుకులతో
బొబ్బలెక్కిన దేహంతో
తిరిగి రావాల్సి వస్తుంది

వానలా కురుస్తున్న ఈ ఎండ
ఎప్పుడాగుతుందో తెలియదుగానీ
మనిషి చేసిన ఘనకార్యాలకు
మండగొడుతోంది ఎండ

ఈ ఎండజల్లు తగ్గేదెపుడో
మళ్లీ మనుషులుగా మనం
తడి తడిగా విరబూసేదెపుడో

**- చిత్తలూరి**
9133832246

ఎడిట్ పేజీ కోసం
మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

# ఆశలు - అసంతృప్తి మధ్య నవ తెలంగాణ



తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఒక కీలక దశలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు పెట్టుకున్న ఆశలు, ఇప్పుడు నెమ్మదిగా ప్రశ్నలుగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన వాగ్దానాలను అమలు చేస్తుందనే నమ్మకం ఒక వైపు సడలిపోతుంటే, మరోవైపు రాజకీయ అస్థిరత సంకేతాలు కనిపిస్తున్నాయి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను విడిచి బీఆర్ఎస్‌లో చేరడం వంటి పరిణామాలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. అంతర్గత అసంతృప్తి ఇంకా ముగియలేదనే సంకేతాలిస్తున్నాయి. అదే సమయంలో కల్వకుంట్ల కవిత ప్రకటించబోయే కొత్త పార్టీ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.


రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ప్రకటించిన 'ఆరు గ్యారంటీలు' ప్రజల్లో భారీ ఆశలు కలిగించాయి. కానీ ఆ హామీల అమలు అనుకున్నంత అద్భుతమేం కాదని తేలిపోయింది. ఏదో కొంతవరకు చర్యలు కనిపిస్తున్నప్పటికీ, స్పష్టత, వేగం లోపించిందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి వర్గాలు ఈ పథకాలు తమ జీవితాల్లో నిజంగానే మార్పులు తెస్తాయని ఆశపడ్డారు. రాజకీయాల్లో వాగ్దానాలు చేయడం చాలా సులభం, కానీ వాటిని స్థిరంగా అమలు చేయడం కష్టం. అదే పరీక్ష ఇప్పుడు రేవంత్ సర్కార్ ఎదుర్కొంటోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 'హైడ్రా'(HYDRAA),'మూసీ ప్రక్షాళన' అంశాలు రాజకీయంగా, సామాజికంగా పెను దుమారం రేపుతున్నాయి. వెలుగుమట్ల వంటి చోట్ల జరిగిన సంఘటనల నుండి మూసీ పరివాహక ప్రాంతాల వరకు పేదల ఇళ్లను కూల్చివేయడం ప్రభుత్వానికి పరిపాలనాపరమైన అవసరంగా అనిపించవచ్చు. చెరువుల పునరుద్ధరణ, నదీ ప్రక్షాళన వంటివి పర్యావరణపరంగా అవసరమే అయినప్పటికీ, దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న సామాన్య ప్రజల ఆవేదనను విస్మరించడం సమంజసం కాదు. స్పష్టమైన పునరావాస ప్యాకేజీలు, మానవీయ కోణం లేని ఇటువంటి చర్యలు ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతున్నాయి. అభివృద్ధి అనేది ప్రజల కన్నీళ్ల మీద కాకుండా, వారి నమ్మకం మీద నిర్మించబడాలి. లేకపోతే, ఈ కూల్చివేతలు భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది. ఒక్కసారి గనక విశ్వాసం దెబ్బ తింటే తిరిగి పొందడం చాలాకష్టం.

తెలంగాణ రాజకీయాల్లో మైనారిటీల ఓట్లు, ముఖ్యంగా ముస్లింల ఓటు ఎప్పటికప్పుడు కీలక పాత్ర పోషిస్తూ వచ్చింది. ఇటీవలి ఎన్నికల్లో కూడా ముస్లింలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో, వారి సమస్యలు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పడుతుందనే ఆశలు వ్యక్తమయ్యాయి.

అయితే కాలక్రమేణా ఆ ఆశలు ఎంతవరకు నెరవేరుతున్నా యన్న ప్రశ్నలు వినిపించడం ప్రారంభమైంది. కొన్ని వర్గాల్లో మైనారిటీల సమస్యలకు ఆశించిన ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అజహరుద్దీన్ పదవీకాలం ముగింపు కూడా ఒక సంకేతంగా చర్చకు వస్తోంది. మైనారిటీ రాజకీయాలు కేవలం ఎన్నికలకే పరిమితమవుతున్నాయా?లేక నిజంగానే వారి అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు మరింత స్పష్టంగా ముందుకు వస్తోంది.

ఇక జీవన్ రెడ్డి పార్టీ మార్పు ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు, ఒక పెద్ద రాజకీయ సంకేతం. ఇది కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత సమస్యలను బయటపెడుతోంది.



ఒక సీనియర్ నాయకుడు పార్టీని విడిచి వెళ్లడం అంటే, ఆ పార్టీలోని నాయకత్వం, విధానాలపై అసంతృప్తి ఉన్నట్లు భావించవచ్చు. జీవన్‌రెడ్డి అదేమీ దాచుకోలేదు, బహిరంగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించాడు. ఇలాంటి పరిణామాలు ప్రత్యర్థి పార్టీలకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయి, అధికార పార్టీకి మాత్రం కొత్త సమస్యలు సృష్టిస్తాయి.

ఈ నేపథ్యంలో కవిత ఎంచుకున్న రాజకీయ దారి ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆమె కొత్త పార్టీ ఆత్మగౌరవం, సామాజిక తెలంగాణ ఆలోచనలపై ఆధారపడుతుందని, ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్తుందని చెబుతున్నారు. యువత, మహిళలు, బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఒక కొత్త సామాజిక సమీకరణను నిర్మించాలనే ప్రయత్నం కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ అంశం దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న సమయంలో, దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం ఒక వ్యూహాత్మక నిర్ణయం.

కవిత స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసి నాయకత్వాన్ని నిరూపించుకోవాలనే స్థిర నిర్ణయంతో ఉన్నారు. అయితే కొత్త పార్టీ స్థాపనతోనే విజయం సాధ్యం కాదు. తెలంగాణలో గతంలో కూడా కొత్త పార్టీలు వచ్చాయి. జయప్రకాశ్ నారాయణ స్థాపించిన లోక్‌సత్తా పార్టీ, విజయశాంతి తల్లి తెలంగాణ, వైఎస్ షర్మిల నెలకొల్పిన వైఎస్‌ఆర్‌టీపీ పార్టీ - ఈ ప్రయత్నాలు మొదట ఆశలు రేపినా, తరువాత నిలబడలేకపోయాయి. కారణం స్పష్టమే, బలమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం, నిరంతర ప్రజా సంబంధాలు లేకపోవడం, నియతృత్వ ధోరణులు ఇలా కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. కవిత పార్టీ కూడా ఇదే పరీక్షను ఎదుర్కొంటుంది.

ఇప్పుడు ప్రధానంగా తలెత్తుతున్న ప్రశ్న ఏమిటంటే, తెలంగాణలో కొత్త పార్టీకి స్థలం ఉందా? ఉంది, కానీ అది ఖాళీగా లేదు. ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పటికీ, వారు ఇప్పటికిప్పుడు ఎవరినైనా వెంటనే అంగీకరించే స్థితిలో లేరు. కొత్త పార్టీకి బలమైన సైద్ధాంతిక భూమిక, స్పష్టమైన విధానం, క్రమబద్ధమైన కార్యాచరణ, స్థిరమైన నాయకత్వం అవసరం. భావోద్వేగాలతో మాత్రమే రాజకీయాలు నడవవు. పనితీరు కూడా అవసరం.

రాష్ట్రంలో నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు పరిమితంగా ఉండటం అసంతృప్తిని పెంచుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, స్థానికులకు అవకాశాలు కల్పించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. ఈ సమస్యలను ఎవరు సమర్థంగా పరిష్కరిస్తారో వారికి మాత్రమే ప్రజల మద్దతు లభిస్తుంది.

ఇక భారతీయ జనతా పార్టీ తన ఉనికిని నిలబెట్టుకుంటూ బలం పెంచుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే దాని రాజకీయ విధానంపై ప్రజల్లో అనుమానాలు, విమర్శలు ఉన్నాయి.

విభజనాత్మక, మతరాజకీయాలపై తీవ్రమైన అభ్యంతరాలున్నాయి. భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న ఈ మత రాజకీయాలు తాత్కాలిక లాభాలు కలిగించవచ్చు, కానీ దీర్ఘకాలంలో సామాజిక సమతుల్యతను దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందుకే సమగ్రత, చర్చ, సమన్వయం ఆధారిత రాజకీయాలు అవసరం.

ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన సమస్య ప్రభుత్వంపై నమ్మకం లోపించడం. ప్రభుత్వ ప్రకటనలు, ఆచరణల మధ్య వ్యత్యాసం కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యుత్, విద్య, ఉపాధి వంటి అనేక ప్రాథమిక సమస్యలు ఇంకా సమస్యలుగానే ఉన్నాయి. ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు కాకపోవడం ఈ అనుమానాలను మరింత పెంచుతోంది.

విద్యా రంగంలో ఫీజుల పెరుగుదల మరో కీలక సమస్య. ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచుతుండగా, ప్రజల ఆదాయం అంతగా పెరగడం లేదు. ప్రభుత్వం దీనిపై కట్టడి చేయకపోతే, ఇది పెద్ద సామాజిక అసమానతకు దారి తీస్తుంది. విద్యను అందరికీ అందుబాటులో ఉంచడం అత్యంత అవసరం.

మరో ముఖ్యమైన విషయం, పరిపాలనలో పారదర్శకత. ప్రజలు ఇప్పుడు కేవలం పథకాలు కాదు, వాటి అమలు ఎలా జరుగుతుందో కూడా చూస్తున్నారు. నిర్ణయాలు పారదర్శకంగా లేకపోతే, అవి ప్రజల్లో అనుమానాలను పెంచుతాయి. పాలనలో బాధ్యతాయుత ధోరణి లేకపోతే, ప్రజల విశ్వాసం కోల్పోతుంది.

మొత్తం మీద చూస్తే, తెలంగాణ రాజకీయాలు ఒక కొత్త దిశలో ప్రయాణిస్తున్నాయి. ప్రజలు ఇప్పుడు బాగా ఆలోచిస్తున్నారు, ప్రశ్నిస్తున్నారు. ఎవరు నిజంగా పని చేస్తున్నారు? ఎవరు కేవలం రాజకీయాలు చేస్తున్నారు? అనే అవగాహనతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇది ఒక ఆరోగ్యకరమైన మార్పు.

మొత్తంమీద, తెలంగాణ భవిష్యత్తు ఇప్పుడు మూడు అంశాలపై ఆధారపడి ఉంది, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్ష బాధ్యత, కొత్త రాజకీయ శక్తుల నిజాయితీ. ఈ మూడు తమ తమ పాత్రలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తేనే రాష్ట్రం ముందుకు సాగుతుంది. లేకపోతే ఈ రాజకీయ హడావిడి తాత్కాలికంగానే మిగిలిపోతుంది.

**- యండి. ఉస్మాన్ ఖాన్**

# ఉద్యోగులకు పే రివిజన్ ఎప్పుడో..?

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పథంలో ఉద్యోగుల పాత్ర అనన్యసామాన్యం. ప్రభుత్వ రంగం, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, విద్యుత్ వంటి కీలక విభాగాలు సమర్థవంతంగా నడవడానికి వారి కృషి మూలాధారం. అయితే, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మరియు జీవన వ్యయాల పెరుగుదల నేపథ్యంలో ఉద్యోగుల ఆర్థిక స్థితి గణనీయంగా ఒత్తిడికి లోనవుతోంది. ఇటీవలి గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సాధారణ ద్రవ్యోల్బణం సుమారు 4.5 నుంచి 5 శాతం మధ్య ఉండగా, ఆహార ద్రవ్యోల్బణం 6 శాతం దాటింది. 2020 నుండి 2026 వరకు మొత్తం ద్రవ్యోల్బణం 25-30 శాతం వరకు పెరిగినప్పటికీ, వేతన సవరణలు మరియు డీఏ పెంపులు కలిపి కేవలం 14-16 శాతం వరకు మాత్రమే ఉపశమనాన్ని కల్పించాయి. ఫలితంగా ఉద్యోగుల వాస్తవ ఆదాయం తగ్గి, వారి కొనుగోలు శక్తి బలహీనపడింది.

ఇక జీవన వ్యయాల పెరుగుదల పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఇళ్ల అద్దెలు 15-20 శాతం వరకు పెరగగా, ఆహార పదార్థాలు, విద్య, ఆరోగ్య ఖర్చులు నిరంతరంగా అధికమవుతున్నాయి. ఇంధన ధరలు, పన్నులు, సేవల ఛార్జీలు కూడా కుటుంబ బడ్జెట్‌పై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక సాధారణ మధ్యతరగతి ఉద్యోగి తన నెలవారీ అవసరాలను నిర్వహించడం సవాలుగా మారింది. ఇదే సమయంలో ప్రైవేట్ రంగంలో ఉద్యోగులకు ప్రతి సంవత్సరం 8-12 శాతం వేతన పెంపులు, ప్రోత్సాహకాలు లభిస్తుండగా, ప్రభుత్వ ఉద్యోగులు నాలుగేళ్లకోసారి వేతన సవరణపై ఆధారపడాల్సి వస్తోంది. అది కూడా తరచూ 1 నుంచి 3 సంవత్సరాల ఆలస్యంతో అమలవుతుండడం సమస్యను మరింత తీవ్రము చేస్తోంది.

ఈ ఆలస్యాల ప్రభావం కేవలం వేతనాలపైనే కాకుండా ఉద్యోగుల జీవన ప్రమాణాలపై కూడా ప్రతికూలంగా పడుతోంది. పెరుగుతున్న ఖర్చులను తట్టుకోలేక అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఉద్యోగుల్లో ఉత్సాహం తగ్గి, పనితీరు దెబ్బతింటోంది. కుటుంబ భద్రత, పిల్లల విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలు కూడా ప్రభావితమవుతున్నాయి. దీర్ఘకాలికంగా చూస్తే, ఇది ప్రతిభావంతులైన సిబ్బంది ప్రైవేట్ రంగానికి వలస వెళ్ళే పరిస్థితిని కూడా సృష్టిస్తోంది.

ఈ నేపథ్యంలో సమయానికి వేతన సవరణ అమలు అత్యవసరం. ఇది కేవలం పరిపాలనా ప్రక్రియ కాదు, ఉద్యోగుల కొనుగోలు శక్తిని కాపాడే, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచే కీలక చర్య. సమయానుకూలంగా వేతనాలు సవరించబడితే ఉద్యోగుల్లో ఉత్సాహం పెరిగి, ఉత్పాదకత మెరుగవుతుంది. అలాగే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వినియోగం పెరిగి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. భవిష్యత్తులో వేతన సవరణలతో పాటు ఆరోగ్య బీమా, పెన్షన్, రిస్క్ అలవెన్సులు, విద్య మరియు గృహ సహాయం వంటి సంక్షేమ చర్యలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మొత్తంగా, తెలంగాణ అభివృద్ధి ప్రయాణాన్ని నిలబెట్టేది ఉద్యోగులే అన్న నిజాన్ని మరువకూడదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల మధ్య వారి ఆర్థిక భద్రతను కాపాడాలంటే సమయానికి వేతన సవరణ అనివార్యం. అది ఉద్యోగి సంక్షేమానికి మాత్రమే కాకుండా, రాష్ట్ర స్థిరత్వం మరియు సుస్థిర అభివృద్ధికి కూడా పునాది అవుతుంది.

**- గువ్వల పవన్‌కుమార్**
అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్


# నారీ శక్తి ముసుగులో డీలిమిటేషన్

భారత రాజకీయ వేదికపై ఒక కీలక మలుపు తిరిగిన క్షణం ఇది. మహిళా సాధికారత అనే లక్ష్యాన్ని ముందుంచుకుని వచ్చిన ఒక చట్టం కానీ దాని వెనుక దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు, ప్రాంతీయ సమతుల్యంపై పడే ప్రభావం దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. 'నారీ శక్తి' అనే ఆకర్షణీయ నినాదం కింద డీలిమిటేషన్ వంటి సున్నితమైన అంశాన్ని కలిపి ప్రవేశపెట్టినప్పుడు, అది కేవలం ఒక శాసన ప్రక్రియగా మిగలలేదు. సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కులు, రాజకీయ నైతికత అన్నీ ఒకే వేదికపై పరీక్షించబడిన పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో లోక్‌సభలో జరిగిన ఓటింగ్ కేవలం సంఖ్యల పోటీ కాదు. అది కేంద్ర-రాష్ట్ర సంబంధాల భవిష్యత్తును నిర్ణయించే ఘట్టంగా మారింది. ఒక వైపు మహిళా రిజర్వేషన్‌కు మద్దతు అనే నైతిక బాధ్యత, మరో వైపు రాష్ట్రాల న్యాయమైన వాటాను కాపాడాల్సిన అవసరం, ఈ రెండింటి మధ్య జరిగిన ఈ పోరు భారత రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది.

ఇదే సంఘటన 'నారీ శక్తి ముసుగులో రాజకీయ ప్రయోజనాలా? లేక సమాఖ్య ధర్మానికి రక్షణగా నిలిచిన ప్రజాస్వామ్యమా?' అనే ప్రశ్నను దేశం ముందుంచింది.

లోక్‌సభలో ఏప్రిల్ 17, 2026న జరిగిన ఓటింగ్‌లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడం ఒక సాధారణ వైఫల్యం కాదు. అది బీజేపీ వ్యూహాత్మక రాజకీయాలకు స్పష్టమైన చెంపపెట్టు. మహిళా రిజర్వేషన్‌ను 'నారీ శక్తి' పేరుతో రాజకీయ ఆయుధంగా మలచి, దానిని డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)తో కలిపి ఒకే ప్యాకేజీగా తీసుకురావడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య హక్కులను కుదించాలని చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. 298 ఓట్ల మద్దతు, 230 వ్యతిరేక ఓట్లతో రెండింతల మెజారిటీ (352) సాధించలేకపోవడంతో బిల్లు వీగిపోయింది. దీంతో అనుబంధ డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం స్వయంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇది కేవలం ఓటు లెక్క కాదు.



భారత రాజకీయ వ్యవస్థలో సమాఖ్య స్ఫూర్తి ఇంకా బలంగా ఉందని నిరూపించిన చారిత్రక క్షణం.

2023లో నారీ శక్తి వందన అధినియమం (106వ సవరణ) ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయం. కానీ అమలు? 2026 తర్వాత మొదటి జనాభా లెక్కలు (సెన్సస్) అనంతరం డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు వాయిదా. ఇప్పుడు 2026లో ప్రభుత్వం హడావిడిగా స్పెషల్ సెషన్ పిలిచి మూడు బిల్లులు తెచ్చింది. 131వ సవరణ ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేసి 2029 ఎన్నికల నుంచే మహిళా కోటా అమలు చేయాలని, లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని, యూటీల్లో కూడా అమలు చేయాలని. ఉద్దేశ్యం ఒకటే. మహిళా సాధికారతను 'ముసుగు'గా ఉపయోగించి డీలిమిటేషన్‌ను త్వరగా ముగించడం. ఇది ఉత్తరాది రాష్ట్రాలకు (జనాభాఎక్కువగా ఉన్నవి) మరిన్నిసీట్లు ఇచ్చి,దక్షిణాది రాష్ట్రాలు (జనాభా నియంత్రణలోసాధించిన విజయం కారణంగా) సీట్లు తగ్గించే వ్యూహం. దీనిని ప్రతిపక్షాలు (ఇండియా కూటమి) స్పష్టంగా చెప్పాయి. మహిళలకు రిజర్వేషన్ మద్దతు ఉంది, కానీ డీలిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే ప్రయత్నం సహించేది కాదు.

ఇక్కడే బీజేపీ వ్యూహం బయటపడింది. 2023లో బిల్లును వాయిదా వేసినప్పుడు ప్రభుత్వం సెన్సస్, డీలిమిటేషన్ తర్వాతే అని చెప్పింది. ఇప్పుడు హడావుడిగా 2011 డేటాను ఉపయోగించి త్వరగా అమలు చేయాలనడం ఎందుకు? ఎందుకంటే 2026 సెన్సస్ పూర్తి కావాల్సి ఉంది, దాని ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణ రాష్ట్రాల సమాఖ్య హక్కులు కాపాడబడతాయి. బీజేపీకి అది అనుకూలం కాదు. మహిళల సాధికారత నిజమైనదైతే డీలిమిటేషన్‌ను వేరుగా చర్చించి, సమాఖ్య సంప్రదింపులతో ముందుకెళ్లాలి. కానీ ప్రభుత్వం ఒకే ప్యాకేజీలో కట్టి, మహిళల వ్యతిరేకులు అని లేబుల్ వేసి వ్యతిరేకతను అణచివేయాలని చూసింది. ఇది బీజేపీ రాజకీయ శైలి. జనాభా, మతం, ప్రాంతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టి అధికారాన్ని కాపాడుకోవడం.

ప్రతిపక్షాలఐక్యత ఈ ఆటను ఆపేసింది. కాంగ్రెస్ నుంచి ద్రవిడ, తెలుగు పార్టీల వరకు అందరూ ఒకే మాట. మహిళా రిజర్వేషన్ కావాలి. కానీ దక్షిణాదిని బలిచేసే డీలిమిటేషన్ కాదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో జాతీయ నమూనాగా నిలిచాయి. వాటి సీట్లు తగ్గితే సమాఖ్య సమతుల్యం దెబ్బ తింటుంది. బీజేపీ ఇప్పుడు ప్రతిపక్షాలు మహిళల వ్యతిరేకులు అని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. కానీ నిజం ఏమిటి? ప్రభుత్వం సొంత వ్యూహం వల్లే బిల్లు వీగిపోయింది. మహిళా సాధికారతను నిజంగా కావాలంటే 2023 బిల్లును వేరుగా అమలు చేసి, డీలిమిటేషన్‌ను సమగ్ర చర్చతో ముందుకు తీసుకెళ్లాలి.

ఈ ఓటమి బీజేపీకి మాత్రమే కాదు.. దేశ రాజకీయ వ్యవస్థకు పాఠం. సమాఖ్య ధర్మం ఇంకా బలంగా ఉంది. దక్షిణ రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకున్నాయి. మహిళల సాధికారత నిజమైన మార్గంలో ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఇకపై ముసుగులు వేయకుండా, నిజాయితీతో చర్చించాలి. లేకపోతే ఇలాంటి చెంపపెట్టులు మరిన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. భారత దేశం ఒక దేశం కాదు - ఒక సమాఖ్య. దానిని గుర్తించకపోతే ఏ వ్యూహమూ ఫలించదు.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
9010128884

# పుస్తకాల పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపంచ కాపీ హక్కుల దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. 1995 నుండి నిర్వహించబడుతున్న ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం రోజున పుస్తకం చదవడం, ప్రచురించడం, కాపీ హక్కులు వంటి విషయాలను ప్రోత్సహించి వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మిగ్యుఎల్ డి సెర్వంటెస్ పుట్టి మరణించిన తేది ఏప్రిల్ 23, విలియంషేక్స్పియర్,గార్సియాసాడిలా వేగా వంటి రచయితలు మరణించిన తేది, అనేక ఇతర రచయితల పుట్టిన, మరణించిన తేది ఏప్రిల్ 23వ తేది అవడంవల్ల 1995, ఏప్రిల్ 23న యునెస్కో తొలిసారిగా ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించింది.

'చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి.

కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు.

మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తి వంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి ఆయుప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగుతున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం', హాలుని 'గాథా సప్తశతి'



ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్యానికి సంబంధించి అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారతదేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యాన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథాసాహిత్యం గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తదితర విశ్వవిద్యాలయాలలో భద్రపరచబడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపు రూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధమయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచమంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది.

అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయా లను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పఠనాసక్తిని పెంపొం దించే కృషి జరగాలి.

అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణపట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

**ఏప్రిల్ 23.. ప్రపంచ పుస్తక దినోత్సవం**
**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఏప్రిల్ 22 (మనం ప్రతినిధి)॰ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో మైనారిటీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు.జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు విద్యార్థులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ను ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఫలితాలు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి విద్యార్థిని వారి ఫలితాల గురించి అడగగా, విద్యార్థులు తమ మార్కులను వివరించారు. శ్రీ శాంతి 482/500, షీబా 480/500 మార్కులు సాధించినట్లు తెలిపారు. చంద్ర వైష్ణవి 491/500 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించి, టిజిఎంఆర్ఈఐఎస్ లో 1వ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. కె. హర్షిత 485/500 మార్కులు సాధించగా, సువర్ణ రాణి 943/1000, నస్రీన్ 891/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. లక్ష్మీ ప్రసన్న 981/1000 మార్కులతో టిజిఎంఆర్ఈఐఎస్ లో 2వ స్థానం పొందినట్లు, అఖిల 973/1000 మార్కులు సాధించినట్లు చెప్పారు. శివ సంజన మరియు శ్రీ హర్షిత ఇద్దరూ 455/470 మార్కులు సాధించగా, నిదా కౌనిన్ 990/1000 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. మనోగ్న 436/440 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించగా, రివ్షా 964/1000 మార్కులు సాధించినట్లు వివరించారు.

విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు రాష్ట్ర స్థాయిలో కూడా మంచి గుర్తింపు తీసుకువచ్చాయని కలెక్టర్ తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలు సాధించవచ్చని ప్రోత్సాహం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# పారిశుధ్య సిబ్బందికి బట్టల పంపిణీ

- పారిశుధ్య సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయం
- మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్



మంథని, ఏప్రిల్ 22 (మనం న్యూస్)॰ మంథని మున్సిపల్ లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ అధ్యక్షతన బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ శుభ్రతలో పారిశుధ్య సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల. సహేందర్ రెడ్డి,పాలక సభ్యులు నూకలకమల్, మాచిడి రాజుగౌడ్,మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, మారుపాక నిహారిక, ౼ఎంటరి రాజు, వేములలక్ష్మి, యేల్లంకి వంశీధర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నేతలు




జగిత్యాల ఏప్రిల్ 22(మనం న్యూస్)॰ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార భాగంలో ఒక మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ఒక ఉగ్రవాదిగా ఒక టెర్రరిస్ట్ గా మాట్లాడిన వాక్యలను భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఖండిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ జిల్లా శాఖ ఆదేశాల మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అన్నిటికీ శాంతి దూతగా ఉండాలని కోరుతున్నటువంటి వ్యక్తి నరేంద్ర మోడీ అని, ఒక వయస్సు మళ్లీ నటువంటి వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ ని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే టెర్రరిస్టుగా అనడం ఏదైతే ఉందో దీన్ని తీవ్రంగా ఖండిస్తూ ఉన్నాం , కేవలం ఓట్ల కోసం కక్కుర్తి పడి ఇష్టానుసారం గా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ ఉన్నాం, ప్రపంచ శాంతి దూతగా ఉండాలని ప్రపంచాన్ని శాసించే వ్యక్తి ట్రంపు లాంటి వ్యక్తులే ఈరోజు యుద్ధం ఆపే విధంగా చేయాలని చెప్పి చెప్పినటువంటి గొప్ప వ్యక్తి నరేంద్ర మోడీ అని, అలాంటి వ్యక్తిని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మి వేయడం లాంటిదేనని ఇక ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు రోడ్లమీద తిరగకుండా చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు, అసలు ఈ కాంగ్రెస్ పార్టీకి రాజకీయ విలువలు తెలుసా తెలవదా అని అడుగుతున్నాం, ఇదే ఖర్గే ఒక సమావేశంలో ఆర్ఎస్ఎస్ ను బిజెపి కార్యకర్తలు ఎక్కడపడితే అక్కడ చంపమని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు ఇవ్వడం జరిగింది ఇట్టి విషయాన్ని కూడా మేము గుర్తు చేస్తా ఉన్నామన్నారు, కాంగ్రెస్ పార్టీ ఒక దేశ విద్రోహ పార్టీ, కాంగ్రెస్ పార్టీ విలువలు సంస్కృతి లేని ఒక విదేశీ పార్టీ అని భావిస్తాఉన్నాము, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే కేవలం నరేంద్ర మోడీ నే కాదు యావత్ దేశ ప్రజలందరినీ అవమానించే విధంగా మాట్లాడాన్ని ఖండిస్తూ వెంటనే బేషరతు గా నరేంద్ర మోడీ కి దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ తరపున డిమాండ్ చేశారు..కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ ,పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమదాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, సీనియర్ నాయకులు తోట శ్రీనివాస్, యువ మోర్చా నాయకులు మండలోజీ సూరజ్, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్ , కార్యదర్శులు రాగూర్ రాకేష్, కలకోట రాజు, శ్యాంరావు నాగులు, సోమిశెట్టి శివ సాయి, పూదరి పవన్, మామిడి రంజిత్, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ మరియు పాల్గొన్నారు

# బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

- మే -14న లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక చేయబడును
- 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఏప్రిల్- 22 (మనం ప్రతినిధి)॰ 2026-27 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కొరకు పెద్దపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు మే 7 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మొత్తము (5) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మూడవ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. ఐదవ తరగతిలో గోండు బాలురకు ఒకటి, 8వ తరగతి లో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలని, ధ్రువీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను మే 07 లోగా కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని, వచ్చిన దరఖాస్తుల నుండి మే 14న లాటరీ పద్ధతిలో ద్వారా ఎంపిక చేయనున్నట్లు, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9502664044, 9959914511 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# టి జి ఎస్ ఆర్ టి సి లో తాత్కాలిక పద్ధతిన డ్రైవర్ కండక్టర్ల నియామకం

జగిత్యాల ఏప్రిల్ 22( మనం ప్రతినిధి )॰ టి జి ఎస్ ఆర్ టి సి లో సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో మూడు డిపోలైన జగిత్యాల, కోరుట్ల మరియు మెట్పల్లిలలో తాత్కాలిక పద్ధతిన పనిచేయుటకు డ్రైవర్స్, కండక్టర్స్ నియామకం కోసం దరఖాస్తులు తీసుకోబడును ఒక ప్రకటన ద్వారా తెలిపారు. దరఖాస్తుదారులు మీ అప్లికేషన్ను మరియు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ను మీ సమీపంలోని సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయంలో తేదీ 23 - 4 - 2026 గురువారం మధ్యాహ్నం 12 గంటల లోపు సమర్పించగలరు.అర్హతలు॰ 1. డ్రైవర్ పోస్ట్ కు ఒరిజినల్ హెవీ మోటర్ వెహికల్ (ఏ౩)లైసెన్స్ కలిగి ఉండాలి. 18 నెలల అనుభవం కలిగి ఉండాలి. కండక్టర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇందుకుగాను రోజువారి వేతనం డ్రైవర్ కు - 1000 రూపాయలు, కండక్టర్కు - 800 రూపాయలతో ఇవ్వబడును డిపో మేనేజర్లు తెలిపారు. 1. జగిత్యాల డిపో మేనేజర్, కే . కల్పన :9959225925, 2. కోరుట్ల డిపో మేనేజర్ సరస్వతి 9959225928, 3. మెట్పల్లి డిపో మేనేజర్ మనోహర్ 9959225927 సంబంధిత కాంటాక్ట్ నంబర్లలో సంప్రదించగలరు అని కోరారు.

# కేసీఆర్ను తిట్టించడానికే మీటింగ్ పెట్టించిన దుద్దిళ్ల శ్రీధర్

- సీఎం మాటలు విని సమాజమంతా అసహించుకుంటున్నరు
- ముఖ్యమంత్రి వస్తే ఈ ప్రాంతానికి అభివృద్ది బాటలు పడాలే
- ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలు సమాధానం చెప్పాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




మంథని ఏప్రిల్ 22 (మనం న్యూస్)॰ ఆనాడు తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణాకు వ్యతిరేకంగా ఆనాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి నీ వల్లెంకుంటకు తీసుకువచ్చి తెలంగాణ వాదాన్ని అణిచివేయాలని చూసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈనాడు తెలంగాణ ఉద్యమనేత మాజీ సీఎం కేసీఆర్ను తిట్టించడానికే కాటారం మండలంలో మీటింగ్ పెట్టి సీఎం రేవంత్రెడ్డిని తీసుకువచ్చాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బుధవారం మంథని నియోజకవర్గంలోని కాటారం మండల కేంద్రంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్తూరిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో నిర్వహించిన మీటింగ్ కాటారం మండలాన్నే అపవిత్రం చేసిందన్నారు. రేవంత్రెడ్డి గొంతెత్తి మాట్లాడితే గొప్పగా అనుకుంటున్నాడేమో గానీ ఆయన మాటలు విని సమాజమంతా అసహించుకుందని అన్నారు.ముఖ్యమంత్రి అనే విషయాన్ని మర్చిపోయి మురికినోటితో నోటికచ్చినట్లు మాట్లాడాడని, ఒక మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ను చెట్టుకు కట్టేసి కొడుతామంటాడా అని అగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్రెడ్డి బుద్ది లేకుండా మట్లాడుతుంటే పక్కనే బుద్ది ఉన్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల నిలువరించాలి కదా అన్నారు.అంటే కావాలనే కేసీఆర్ను తిట్టించడం కోసమే ఇక్కడ మీటింగ్ పెట్టించాడని అర్థం అవుతుందన్నారు. ఆనాడు పీవీ నర్సింహరావు నాలుగు సార్లు మంథనికి ప్రాతినిధ్యం వహించారని, ఆయనకు ఓట్లు వేసి గెలిపించుకున్న గడ్డ మంథని అని ఆయన గుర్తు చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఇచ్చిన హమీలన్నీ అమలు చేసిందని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆరు గ్యారెంటీలు, 420హమీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.


# క్షయవ్యాధి గురించి ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలి

- జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ ఓ శ్రీనివాస్



జగిత్యాల, ఏప్రిల్ 22(మనం న్యూస్)॰ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జగిత్యాల రూరల్ మండలం చలిగల్ గ్రామంలో క్షయ వ్యాది గ్రస్తు లకు వైద్య శిబిరము నిర్వ హించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సలహాలను సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, తెమడలో రక్తం పడటం, చాతిలో పట్టేసినట్టు ఉండడం ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి తగు పరీక్షలు చేయించుకొని మందులు వాడాల్సిందిగా సూచించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన ప్రజలు 60 మందికి డిజిటల్ ఎక్స్ రే పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశామని కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ సౌజన్య అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ రూమన్, ఎం ఎల్ హెచ్ పి లు డాక్టర్ శామిని, అనూష , సూపర్వైజర్ సుజాత,టిబి సూపర్వైజర్ శ్రీనివాస్, రేడియో గ్రాఫర్ వికాస్ ఏఎన్ఎంలు షమీం సుల్తానా జయప్రద ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో మరమ్మత్తులు పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సుల్తానాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్)॰ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ వీక్ సందర్భంగా హాస్టళ్లు, గురుకులాల్లో చేపట్టిన చిన్నపాటి మరమ్మత్తు పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష₹ బుధవారం ఫీల్ సందర్శనలో భాగంగా సుల్తానాబాద్ ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి అక్కడ సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, డోర్లు, కిటికీల మరమ్మత్తులకు సంబంధించిన అంచనాలను ఈరోజు సాయంత్రం వరకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన బడ్జెట్ విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాల్ను పరిశీలించి, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని మరమ్మత్తు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, కిచెన్ పరిసరాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని, ఆహారం నిల్వ విధానాన్ని తనిఖీ చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమాచార్య, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# దోమకొండ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థినులతో మమేకమై ఆశయాలు తెలుసుకున్న ఆశిష్ సంగ్వాన్
- వీధి దీపాలు, ప్రహరీ గోడను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశం



కామారెడ్డి, ఏప్రిల్ 22 ( మనం ప్రతినిధి)॰ కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దోమకొండ మండలంలోని బాలికల రెసిడెన్షియల్ వసతిగృహాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. హాస్టల్లోని వసతులు, విద్యార్థినుల పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో మమేకమై, ఒక్కొక్కరితో మాట్లాడి వారి భవిష్యత్ ఆశయాలు, లక్ష్యాలను తెలుసుకున్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి. తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి అని సూచించారు.

## హాస్టల్ మెనూ పై ఆరా...

హాస్టల్లో మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు సక్రమంగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎల్లప్పుడూ పరిశుభ్రత పాటించాలని ప్రిన్సిపాల్కు ఆదేశించారు.

## మౌలిక వసతులపై సంతృప్తి...

హాస్టల్కు సీసీ రోడ్డు మంజూరైనప్పటికీ వీధి దీపాల కొరత ఉన్నదని ఎంపీడీవో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ శాఖ సహకారంతో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ, జిల్లా కలెక్టర్ నిధులతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్కు సూచించారు. అదేవిధంగా కాంపౌండ్ వాల్ పడిపోయిన విషయాన్ని గమనించి, దాని పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా సామాజిక సంక్షేమ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ తిరుమల గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ శివరాములు, ప్రత్యేక అధికారిణి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సుధాకర్, ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఓ రవికుమార్, ప్రిన్సిపాల్ చైతన్య సుధ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల మంత్రి జోక్యం చేసుకోవాలి

- బూడిద గణేష్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు

మంథని, ఏప్రిల్ 22 (మనం న్యూస్)॰ ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ కోరారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. బుధవారం మంథని ఆర్టీసీ డిపో కార్మికులు విధులు బహిష్కరించి గేట్ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని,ఆర్టీసీ కార్మికుల ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్ గా ఐటీ మంత్రి శ్రీధర్ బాబుఉన్నారని, వెంటనే రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో జోక్యం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.అలాగే ఆర్టీసీ యాజమాన్యం సమ్మెను విచ్చినం చేయడానికి ప్రయత్నం చేస్తుందని, శిక్షణలేని డ్రైవర్లతో బస్సులు నడిపించడం వల్ల బస్సులు ప్రమాదాలకు గురై అవకాశం ఉందన్నారు.రాష్ట్రంలో ఏ బస్సు ప్రమాదానికి గురైన ఆర్టీసీ యాజమాన్యం,ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ పెద్ద సంక్షేమ రంగమని గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణాలు చేస్తున్నారని, ఇలాంటి సేవా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల అందరి పైన ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేసి ఆర్టీసీని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొరెంకల సురేష్, జెసి నాయకులు కేకేరెడ్డి, ఐలయ్య,కుమార్, మునీర్,ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఉచిత హెల్త్ కార్డులు జారీ అభినందనీయం



- వెల్నెస్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు
- ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు జర్నలిస్టులకు వర్తించేలా కార్డులు
- రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 22 ( మనం ప్రతినిధి ): అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలాప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెల్నెస్ ఆసుపత్రి యాజమాన్యం జర్నలిస్టులకు ఉచిత హెల్త్ కార్డులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ఒక ప్రైవేట్ ఆసుపత్రి నుండి ఉచితంగా జర్నలిస్టులకు కార్డులు అందిస్తున్నారంటే మొదట ఊహించలేదని, ఈ సందర్భంగా వెల్నెస్ వారికి అభినందనలు తెలుపుతున్నమన్నారు. బుధవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో వెల్నెస్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు అసద్ ఖాన్, సుమన్ గౌడ్, వివేకానంద రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భార్గవ, మోబిన్ పటేల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐఐఎచ్ఎఫ్ డబ్లూ ఛైర్పర్సన్ డా. కవిత రెడ్డి, డిపిఅర్ఓ పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ., సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తూ వెల్నెస్ హాస్పిటల్ వారు తీసుకున్న నిర్ణయం గొప్పదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి వర్కింగ్ జర్నలిస్టులకి వైద్య సహాయం కల్పించాలని కోరినప్పుడు రెండు లక్షల వరకు యూనైటెట్ ఇన్సూరెన్స్ కంపెనీ తో ఇన్స్యూరెన్స్ చేయించారన్నారు. అందులో 1/3 జర్నలిస్టులు కట్టాలని, 2/3 ప్రభుత్వం భరించిందన్నారు. ఆరోగ్య శ్రీ పేదలకు వర్తించేలా ఉండేదని, వర్కింగ్ జర్నలిస్ట్ లకు కూడా రాజశేఖర్ రెడ్డి ఇవ్వడం జరిగిందన్నారు. కేసీఆర్ హయంలో రెండేళ్లు కార్డులు పనిచేశాయని, ప్రభుత్వం ఆసుపత్రులకు చెల్లింపులు ఇవ్వకపోవడంతో వైద్య సేవలు అందించలేకపోయారన్నారు. తాను చైర్మన్ గా ఎన్నికైన తర్వాత బకాయిలు చెల్లించి కార్డులు పనిచేసేలా చేసామన్నారు. దేశంలోనే 29 రాష్ట్రాలలో ఉన్న కార్డులలో రెండు తెలుగు రాష్ట్రలలో ఉన్న కార్డులే ఎక్కువగా ఉన్నాయన్నారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ కార్డులు అందేలా చూస్తామన్నారు. డెస్క్ జర్నలిస్టులకు కూడా గతంలో లాగే ఇస్తామన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, అక్రిడిటేషన్ ప్రక్రియలో తప్పులు లేకుండా ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిజామాబాద్ వెల్నెస్ ఆసుపత్రి యాజమాన్యం జర్నలిస్టుల కోసం ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డులు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వాలు ఉచిత విద్యా, వైద్యం ప్రజలకు అందించాలని, పేద ప్రజలకు కాలవాల్సిన విద్య వైద్యం, ఇల్లు అందనంత కాలం దేశం అభివృద్ధి జరుగదన్నారు. రెండు మూడు రోజుల్లో ఇండ్ల స్థలాల కోసం రెవెన్యూ మంత్రితో సమావేశం ఉందని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జారీ చేయనున్న అక్రిడిటేషన్ కార్డులు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందరికీ వర్తించేలా కార్డులు రూపొందిస్తున్నామన్నారు. మంచి చెడును గుర్తించి ముందుకు వెళ్ళక పోతే సమాజంతో పాటు మనమే నష్టపోతామని, పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు సంక్షేమ ఫలాలు అందాలంటే అర్హులకు మాత్రమే కార్డులు అందేలా చూడాలన్నారు. స్వతంత్రత గలది జర్నలిజమని, ప్రమాణాలు పడిపోతున్నాయన్నారు. మెయిన్ మీడియా వైఫల్యాల వల్లనే సోషల్ మీడియా మీద ప్రజలు ఆధార పడుతున్నారన్నారు. ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు నియమ నిబంధనలు ఉంటాయని సోషల్ మీడియా కు ఎలాంటి నిబంధనలు లేకుండా పోవడంతో వారికి నచ్చిన విధంగా రాస్తున్నారని అన్నారు. సమాజ హితం కోరే వాళ్ళు జర్నలిస్టులని, పత్రిక స్వేచ్ఛను కాపాడే వారీగా ఉండాలన్నారు. ఏం ప్యానల్ లో ఉన్న లేకున్నా, ఆర్ ఎన్ ఐ, పి ఆర్ జి ఐ ఉండి పత్రికలు ప్రింట్ చేస్తున్న వారికి రెండు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని తమ దృష్టికి తీసుకువచ్చారని, జర్నలిస్టుల ఐక్యత ప్రదానమని, ఇవే జర్నలిస్టులను రక్షిస్తాయన్నారు. వార్తలు, కథనాల ద్వారా ప్రజల్లో విశ్వాసం కలిగించడం గొప్ప విషయమని, జర్నలిజాన్ని రక్షించుకుందామన్నారు. డాక్టర్ ఐ ఐ హెచ్ ఎఫ్ డబ్ల్యు కవితా రెడ్డి మాట్లాడుతూ., విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు ఆరోగ్యం పై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, రోజు క్రమ తప్పకుండా నడక, వ్యాయామం చేయాలన్నారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వెల్నెస్ యాజమాన్యం ఉచిత హెల్త్ కార్డులు అందించడం అంటే మామూలు విషయం కాదని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రి అనగానే లాభాల కోసం చూస్తారన్న అపోహ ప్రజల్లో ఉంటుందని, వెల్నెస్ యాజమాన్యం ద్వారా ఇంత మంచి కార్యక్రమం చేపట్టడం వైద్య వృత్తికి మరింత ఖ్యాతిని పెంచుతుందన్నారు. వైద్యం సామాన్యులకు చేరవకావాలని, జర్నలిస్టులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం గొప్ప విషయమని, తన వంతుగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వెల్నెస్ హాస్పిటల్ ఎండి అసద్ మాట్లాడుతూ., 2018లో అమీర్పేటలో ప్రారంభమైన వెల్నెస్ మా సేవలు నేడు 7 బ్రాంచులు పూర్తి చేసుకొని, ఎనిమిదవ బ్రాంచ్ ప్రారంభించనున్నామన్నారు. జర్నలిస్టు మిత్రులు కలసినపుడు ఏదైనా చేయాలని ఆలోచించామని, ఈ ఉచిత హెల్త్ కార్డుల ద్వారా జర్నలిస్టుల కుటుంబాలకు అత్యాధునిక చికిత్సలు పూర్తి ఉచితంగా అందుతాయన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పంచరెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్ లు మాట్లాడుతూ., నగర జర్నలిస్టులకు ఉచిత హెల్త్ కార్డులు అందించడం సంతోషంగా ఉందన్నారు. వెల్నెస్ ఆసుపత్రి యజమాన్యాన్ని కలిసినప్పుడు నగర జర్నలిస్టులకు ఏదైనా చేయాలని ఆలోచించి ఉచిత వైద్యం కోరగా ఫ్యామిలీ హెల్త్ కార్డు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో బిజీగా ఉండే జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ, రాష్ట్రంలోనే మొదటిసారిగా నిజామాబాద్లో ఈ హెల్త్ కార్డుల పంపిణీ చేయడం, వెల్నెస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ ఆస్పత్రి డైరెక్టర్లు అసద్ ఖాన్, సుమన్ గౌడ్ , ముబీన్ పటేల్ భార్గవ్, వినోద్ కుమార్ తోపాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లు, వీడియో జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, ఉర్దూ జర్నలిస్టులు, వివిధ పేపర్లకు సంబంధించిన ఎడిటర్లు, అన్ని జర్నలిస్ట్ సంఘాల నాయకులు జర్నలిస్టులు, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు హర్షణీయం

- కేసీఆర్, హరీశ్ రావులకు శుభాకాంక్షలు
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, ఏప్రిల్ 22 మనం ప్రతినిధిః కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హర్షించారు. న్యాయస్థానంలో అంతిమంగా సత్యం, ధర్మమే గెలిచాయంటూ పార్టీ అధినేత కేసీఆర్ కి, మాజీ మంత్రి హరీశ్ రావు కి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు సత్యం, ధర్మం పక్షాన నిలిచింది. ఇది బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ రైతాంగానికి దక్కిన నైతిక విజయం. తెలంగాణ జలప్రదాత కేసీఆర్ కి, ప్రాజెక్టు నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిన మాజీ మంత్రి హరీశ్ రావు కి నా ప్రత్యేక శుభాకాంక్షలు. కేవలం రాజకీయ కక్షసాధింపుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘోష్ కమిషన్ వ్యాఖ్యలు చెల్లవని కోర్టు తేల్చిచెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి సాగించిన విచారణ కేవలం రాజకీయ డ్రామా అని స్పష్టమైంది. కేవలం రెండు పిల్లర్లకు చిన్న రిపేర్లు చేస్తే సరిపోయే దానికి.. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని, అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దుష్ప్రచారం, రాజకీయ కుట్రలు ఈ తీర్పుతో ప్రజల ముందు బట్టబయలయ్యాయి. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరమే. కేసీఆర్ అద్భుత సృష్టిని, కేసీఆర్ కష్టాన్ని మసిపూసి మారేడుకాయ చేయాలని చూసిన కాంగ్రెస్ నాయకులకు హైకోర్టు తీర్పుతోనైనా జ్ఞానోదయం కావాలి. హైకోర్టు తీర్పు తర్వాత అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరవాలి. ఇకనైనా ఈ కక్షసాధింపులు, రాజకీయ డ్రామాలు కట్టిపెట్టి.. వెంటనే ఆ పిల్లర్లకు మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాలి.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలి

- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్సు డిపో వద్ద సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం



గజ్వేల్, ఏప్రిల్ 22 మనం న్యూస్ః ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కారం చేయాలని ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్సు డిపో వద్ద బుధవారం ఉదయం నుండి సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ బందుకు సంపూర్ణ మద్దతును తెలపడం జరుగుతుందని, గత ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణ చేయడం, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇస్తామని చెప్పి ఆర్టీసీ కార్మికులను మోసం చేశారని ఆరోపించారు.అబద్దాల పునాదుల మీద ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పూర్తిస్థాయిలో మోసం చేశారని ఈరోజు ఆర్టీసీ బందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బందు పాటించడం కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి పూర్తిగా వైఫల్యమె నని ఎండగట్టారు. ఈరోజు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న బందుకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపి వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీగా భాధ్యతలు స్వీకరించిన చైతన్య రెడ్డి



సంగారెడ్డి, ఏప్రిల్ 22 మనం ప్రతినిధిః సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా చైతన్య రెడ్డి, ఐపిఎస్. బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చైతన్య రెడ్డి, ఐపిఎస్., 2022 బ్యాచ్కు చెందిన అధికారి. గతంలో కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో ఏళ్ల వేళల అందుబాటులో ఉంటానని తెలిపారు.

# చలివేంద్రాలు బాటసారులకు ఎంతగాను ఉపయోగపడతాయి



గజ్వేల్, ఏప్రిల్ 22(మనంన్యూస్)ః చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో బాటసారులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని కిరాణం వర్తక సంఘం అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధి బిక్షపతి అన్నారు. బుధవారం స్థానిక ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద కీర్తిశేషులు బుద్ద మీనా జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 400 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడమైనది. చలివేంద్ర నిర్వాహకులు అంతునూరి శివకుమార్, తోట బిక్షపతులు మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు గజ్వేల్ పట్టణానికి రావడం జరుగుతుంది వారి దాహార్తిని తీర్చేయానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు దూబకుంట మెట్రములు,డాక్టర్ సుధాకర్, మరియాల లింగం దుపకుంట లచ్చయ్య,అమ్మిరి శెట్టి హరి కిషన్ , గంగా రమేష్, గంగిశెట్టి వెంకటేశం, గంగిశెట్టి ఉమేష్, కైలాస ప్రశాంత్, బచ్చు రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంలో ఆంతర్యమేంటో
- మామూళ్ల మత్తులో పర్యవేక్షణను గాలికి వదిలేసిన సంబంధిత అధికారులు





జమ్మికుంట, ఏప్రిల్ 22 (మనం న్యూస్)ః అర్థ బలం, అంగ బలం ఉంటే ప్రభుత్వ నిబంధనలతో పనేముంది. ప్రభుత్వ నిబంధనలను అమలయ్యేలే చూడాల్సిన సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్ళినప్పటికీ స్పందించకపోవడం చూస్తుంటే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కే వారికి ఎంతలా విధేయత చూపుతున్నారో అర్థం అర్థమవుతుంది. అధికారుల అలసత్వం ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతున్న తమకెందుకులే అనే తీరుగా సంబంధిత శాఖల అధికారులు వ్యవహరిస్తుండడం చూస్తుంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే మనం పొరబడినట్లే జమ్మికుంట పట్టణానికి కూతవేటు దూరంలోని ప్రధాన రహదారి పక్కన ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ ఇటుక బట్టీల నిర్వహణ చేపడుతున్నారు. తమ గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టిల నిర్వహణ చేపడుతున్నారని స్వయంగా గ్రామపంచాయతీ కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులకు గత సంవత్సరం జూలై నెలలో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంలో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు. ఒక రెవెన్యూ శాఖ అధికారులు తప్ప మిగతా ఏ శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రెవెన్యూ శాఖ అధికారుల ఆదేశాలను సైతం ఇటుక బట్టీల నిర్వాహకులు ధిక్కరిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళితే... జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ శివారు సర్వేనెంబర్ 401, 407, 408, 409 లోని సుమారు 11 ఎకరాల వ్యవసాయ భూమిలో నాలా కన్వెన్షన్ లేకుండానే, ప్రభుత్వ శాఖల అనుమతి తీసుకోకుండానే గత కొన్నేళ్లుగా అక్రమంగా ఇటుక బట్టీల నిర్వహణ చేపడుతుండడంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. సంబంధిత శాఖల అనుమతులు లేకుండా, భూవినియోగ నిబంధనలు పాటించకుండా ఇటుక బట్టీలను నడుపుతుండడంతో ఇటుక బట్టీల నుంచి వెలువడే దట్టమైన పొగ కారణంగా సమీప ప్రాంతంలోని గాలి కాలుష్యం అధికమవుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట సాగుకు యోగ్యత లేని భూమిలోనే పరిశ్రమలను నెలకొల్పాల్సి ఉంటుంది కాని అందుకు భిన్నంగా పంట పొలాలకు సమీపంలోనే ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో వ్యవసాయ భూముల సారవంతత తగ్గుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వహణపై సంబంధిత రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించే వారిని ప్రోత్సహిస్తూ, అక్రమంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం కాపాడబడుతుందని పలువురు మేధావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**ఇటుక బట్టీల ఏర్పాటుకు పాటించాల్సిన నిబంధనలు...**

ఇటుక బట్టీల ఏర్పాటుకు భూమి వినియోగ మార్పు అనుమతి, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు, గ్రామపంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే కార్మిక శాఖ నిబంధనల ప్రకారం కార్మికుల భద్రత, కనీస వేతనాలు, బాల కార్మిక నియంత్రణ వంటి అంశాలను ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది. నివాస గృహాలకు 500 మీటర్ల దూరంలోనే ఇటుక బట్టీల నిర్వహణ చేపట్టవలసి ఉంటుంది. కాని ఈ నిబంధనలలో ఏ ఒక్కటి కూడా ఇటుక బట్టీల నిర్వాహకులు పాటించడం లేదు.

**అక్రమ ఇటుక బట్టిల నిర్వహణపై సంబంధిత అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశాం...**

జమ్మికుంట మండల పరిషత్ అధికారి (ఎంపిఓ) వెంకటేశ్వర్లు జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ శివారు సర్వేనెంబర్ 401, 407, 408, 409 లోని సుమారు 11 ఎకరాల వ్యవసాయ భూమిలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఇటుక బట్టీల నిర్వహణ చేపడుతున్న విషయం వాస్తవమే.

ఇట్టి విషయంపై గ్రామ కార్యదర్శితో గత సంవత్సరం జూలై నెలలో నిబంధనలు పాటించకుండా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్న నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, కార్మిక శాఖ, జిల్లా పరిశ్రమ శాఖ, అటవీశాఖ, భూగర్భ గనుల శాఖ అధికారులకు లేఖలు రాయడం జరిగింది. ఇప్పటివరకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల నుండి మాకు ఎలాంటి సమాచారం రాలేదు. రెవెన్యూ అధికారులు మాత్రమే కొంతమేరకు స్పందించారు. మరోసారి ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు అక్రమ ఇటుక బట్టీల నిర్వాణపై ఫిర్యాదు చేయాలని గ్రామ కార్యదర్శికి సూచించడం జరిగింది.

# వెలుగులు పోయి.. చీకట్లు మిగిలి..

- భిక్కనూర్ సెంట్రల్ లైటింగ్ నిర్వహణ గాలికి...!



భిక్కనూర్, ఏప్రిల్ 22 ( మనం న్యూస్ )ః లక్షల రూపాయల ప్రజాధనంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నేడు నిరుపయోగంగా మారింది. భిక్నూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట వెలుగులు నింపాలని, పట్టణ సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ లైట్లు ఇప్పుడు కేవలం అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, సరైన నిర్వహణ లేకపోవడంతో ఈ ప్రాజెక్టు ఉద్దేశం నీరుగారిపోతోందని స్థానికులు మండిపడుతున్నారు.

**అట్టహాసంగా ప్రారంభం.. ఆపై విస్మరణ...**

కొన్నేళ్ల క్రితం ఎంతో హంగామా చేసి, భారీ బడ్జెట్తో ఈ సెంట్రల్ లైటింగ్ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో రాత్రి వేళల్లో ఈ వెలుగులతో మెరిసిపోయిన భిక్నూర్ వీధులు, ఇప్పుడు మళ్ళీ చీకట్లోకి జారుకున్నాయి. చాలా చోట్ల బల్బులు పగిలిపోవడమో లేదా సాంకేతిక లోపాలతో వెలగకపోవడమో జరుగుతోంది. అయినప్పటికీ, వీటిని బాగుచేసే నాధుడే కరువయ్యారు.

**ప్రమాదాలకు పొంచి ఉన్న ముప్పు..**

ప్రధాన కూడళ్లలో లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చీకటి కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు వెచ్చించిన ఈ వ్యవస్థ వృధా అవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'లక్షల రూపాయలు ఖర్చు చేసి పెట్టిన లైట్లు వెలగకపోతే అది ప్రజాధనాన్ని వృధా చేయడమే. రాత్రి పూట ప్రయాణం నరకంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టాలి.' అని భిక్నూర్ వాసులు కోరుతున్నారు.

**అధికారులు స్పందిస్తారా..?**

సెంట్రల్ లైటింగ్ వ్యవస్థకు మళ్ళీ పూర్వ వైభవం తీసుకురావాలని, కనీసం ఉన్న లైట్లనైనా మరమ్మతులు చేసి వెలిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరి ఇప్పటికైనా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపుతారా? లేక ఈ ప్రాజెక్టు ఇలాగే వృధాగా వదిలేస్తారా? అనేది వేచి చూడాలి.

# కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించండి

- కేంద్రాల వద్ద టార్పాలిన్ తప్పనిసరి
- మండలాల్లో అధికారులు సంయుక్త తనిఖీలు చేయండి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, ఏప్రిల్ 22(మనం బ్యూరో): యాసంగి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం చిగురుమామిడి మండలం పీచుపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కొత్తపల్లి మండలం మల్కాపూర్ లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్, ఆర్డీవో మహేశ్వర్, సివిల్ సప్లై ఆఫీసర్ నర్సింగరావు, డీఎం రజనీకాంత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని అన్నారు. రైతులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కిట్లు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం సేవలు అందుబాటులో ఉండాలని అన్నారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా ధాన్యం కొనుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తూ ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు అదేవిధంగా సన్నద్ధం కావాలని సూచించారు.

**ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలి....**

మండలాల వారీగా ధాన్యం కొనుగోళ్లను మండల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని, కొనుగోళ్ల రిజిస్టర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అన్నారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సమన్వయంతో కొనుగోలు పూర్తయిన ధాన్యం త్వరితగతిన మిల్లింగ్ కోసం వెళ్లేలా చూడాలని, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం కుప్పలు, రికార్డులు పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. యంత్రంతో ధాన్యంలోని తేమశాతం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని డీసీఎస్వోను ఆదేశించారు. కార్యక్రమంలో తహసిల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు వేగవంతం

**వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి**

**అధికారులు అలసత్వం వీడి పనులు ముమ్మరం చేయాలి**

**గోదావరి జలాలతో ఉభయ జిల్లాలు సస్యశ్యామలం**

**సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం బ్యూరో): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంటలో అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం కలెక్టర్లు అంకిత్, అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యాతాలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల అమలులో ఉన్న లోపాలు, సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేసి, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని వీడి పనులను వేగవంతంగా చేయాలన్నారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. యాతాలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని పూర్తి



చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్నచిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

యాతాలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ కాలువ స్టెబిలైజేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్ జలాలు అందకపోయినా వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా వేంసూరు, దమ్మపేట మండలాలకు కూడా నీరు అందించే అవకాశముందని అన్నారు. నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే సంవత్సరం అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు గోదావరి జలాలు అందించవచ్చని తెలిపారు. దీంతో మొత్తం 110 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ పూర్తవుతుందని, మెయిన్ కాలువతో పాటు మూడు పంప్ హౌస్లను వినియోగించి గోదావరి జలాలను ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలకు సరఫరా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు అందించడమే కాకుండా మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ను పూర్తి చేసి పినపాక నియోజకవర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్టును నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,ఉభయ జిల్లాల ఇంజనీరింగ్ ఇరిగేషన్ పోలీస్ ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు : మంత్రి పొంగులేటి

- **ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ**

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదని, ఈ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిందో వారు సమాధానం చెప్పాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూనే.. కొత్తగా ఆరు గ్యారంటీల హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.



**గడప వద్దకే సంక్షేమం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను నేరుగా పేదల గడప వద్దకే చేరుస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలతో ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తోందని చెప్పారు.

**రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు**

ఇళ్ల నిర్మాణ విషయంలో గత ప్రభుత్వం పేదలకు కేవలం అబద్ధపు హామీలే ఇచ్చిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

**విద్య, వైద్యానికి అత్యున్నత ప్రాధాన్యం**

ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు తగిన సమాధానం చెప్పారని, ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ , ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయచందర్ , ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సైకిల్ ర్యాలీ




వైరా, ఏప్రిల్ 22 (మనం న్యూస్): అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత పాల్గొని సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు భూమిని కాపాడుకుందాం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం పచ్చదనం పెంచుదాం వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డా పి భుమేష్ రావు మాట్లాడుతూ, అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. భూమిని సంరక్షించడం మనందరి బాధ్యత అని, చిన్నచిన్న చర్యల ద్వారా కూడా పర్యావరణాన్ని కాపాడవచ్చని , 'ప్రకృతిని మనం కాపాడితే.. అదే మనల్ని కాపాడుతుంది అనే నినాదంతో తరువాతి తరాల కోసం పచ్చని, స్వచ్ఛమైన భూమిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మరియు గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమౌతుందని భూమిపై ఉన్న అన్ని వనరులు సక్రమంగా ఉంటేనే మానవ మనుగడ అభివృద్ధికి ఎటువంటి అవాంతరాలు ఉండవని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, భువనప్రసాద్, ఎఓ నరసింహ రావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 24న జరిగే మహాధర్నాని జయప్రదం చేయండి



- **బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు**

వైరా, ఏప్రిల్ 22 (మనం న్యూస్): ఈ నెల 24న ఖమ్మం కలెక్టరేట్ ముందు నిర్వహించబోయే రైతుల మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు రైతులకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయటంలో విఫలం అయ్యిందని అన్నారు.

ఆరుగాలం కట్టించి పంట పండించిన రైతులకు మొక్కజొన్న 26 క్వింటాలు నిబంధన ఎత్తివేసి పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేయాలని ,కౌలు రైతులకు ఓటిపి విధానాన్ని త్వరగా అమలు చేయాలని , కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని మొక్కజొన్న రైతులకు గన్ని సంచుల సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున జరగబోయే మహాధర్నాలో వైరా రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ ప్రెస్ మీట్ లో మండల ,పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, అప్పం సురేష్ ,మాదినేని దుర్గాప్రసాద్ ,తిరుపతి శ్రీను, భూమాత కృష్ణమూర్తి, కామినేని శ్రీనివాసరావు మిషన్ భగీరథ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రవి, ఏదునూరు శ్రీను, వజినేపల్లి చక్రవర్తి, పాసంగలపాటి శివ, సింగవరపు నరేష్ ,వేముల శివకృష్ణ ,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలి

- **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**
- **జూన్ మొదటి వారానికి బైపాస్-కేబుల్ బ్రిడ్జ్ మధ్య రిటైనింగ్ వాల్ పూర్తి చేయాలి**
- **మొక్కజొన్న 2.17 లక్షల టన్నులు, వరి 2,37,500 టన్నుల కొనుగోళ్లు లక్ష్యం**
- **92 కోట్లతో 20 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్ ప్రతిపాదనలు**

ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్): అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు చూపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. పౌర సరఫరాలు, మార్కెటింగ్, మార్క్ఫెడ్, పంటల కొనుగోలు, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రగతి, ఖమ్మం నగర కార్పొరేషన్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటల కొనుగోళ్లు, నగర అభివృద్ధి పనులను ఎటువంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ మొదటి వారానికి బైపాస్ నుంచి కేబుల్ బ్రిడ్జ్ వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తవ్వాలని, చిన్న గ్యాప్ కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, క్రీడాకారుల వసతి గృహాలు, అతిథి గృహం, కన్వెన్షన్ హాల్ వంటి సదుపాయాలతో 20 ఎకరాల్లో 92 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కనీసం 50 శాతం కేంద్ర నిధులు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని, 200 మంది క్రీడాకారులకు వసతి కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అత్యున్నత నాణ్యతతో నిర్మించబడిందని, దానికి సరైన నిర్వహణ, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి త్వరలోనే క్రీడా కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు నిర్వహించి ఘనంగా ప్రారంభోత్సవం చేయాలని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో రోడ్ డివైడర్ అధిక స్థలం ఆక్రమిస్తోందని, భవిష్యత్తులో మార్పులు చేయాలని, ఆకర్షణీయమైన మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ధంసలాపురం ఎస్టీపీ స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్లైన్ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం ఖిల్లాకు రోప్వే నిర్మాణం వర్షాల వల్ల ఆగకుండా అవసరమైన పనులు వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని, ఈ నెలలో బేస్మెంట్ పనులు పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ అభివృద్ధి పనులు, పంటల కొనుగోళ్లు సమాంతరంగా జరగాలని, మార్కెట్ కాంపౌండ్ వాల్, మిగిలిన షెడ్లు ఈ నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సోలార్ పవర్ వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, విక్రయం అంశాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. వరదల సమయంలో మార్కెట్లో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంటల కొనుగోళ్లపై మంత్రి మాట్లాడుతూ ఏ కేంద్రంలోనూ గన్నీ బ్యాగుల కొరత రాకూడదని, అవసరమైన చోట అదనపు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, పీఏసీఎస్లలో డిమాండ్ మేరకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిల్వ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరి కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని, ఇతర జిల్లాలతో సమన్వయం చేసుకుని వరి తరలింపులు చేపట్టాలని సూచించారు. జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ పెంచి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు.

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, 4 లక్షల 34 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండగా 2.17 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 39 వేల టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో 72 వేల టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని తెలిపారు. 2,37,500 మెట్రిక్ టన్నుల వరి కొనుగోళ్లకు 308 కేంద్రాలు ప్రతిపాదించగా, 240 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. 45 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. టీయూఎఫ్ఐడీసీ కింద 66 పనులు



మంజూరు కాగా 63 పూర్తయ్యాయని, మిగిలిన 3 పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. సింథటిక్ ట్రాక్‌ను 5 లేయర్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించామని చెప్పారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో రోడ్డు, డివైడర్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ధంసలాపురం ఎస్టీపీ స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ అభివృద్ధి పనులు జూలై చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మే నెలలో వేగంగా పనులు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి మన ప్రభుత్వం

- **సన్నవడ్లకు క్వింటాల్కు రూ. 500 బోనస్**
- **ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ**
- **మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

నేలకొండపల్లి, ఏప్రిల్ 22(మనం న్యూస్): రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం నేలకొండపల్లిలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు వరి వేస్తే ఉరి అన్న పాలకులకు భిన్నంగా, నేడు సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని వివరించారు.

**మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్**

ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నెరవేరుస్తోందని పొంగులేటి స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని, తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్లు విడుదల చేసి 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసిందని



గుర్తు చేశారు. గతంలో రైతు బంధు కింద రూ. 10 వేలు అందిస్తే, ప్రస్తుతం రైతు భరోసా ద్వారా రూ. 12 వేలు అందిస్తున్నామన్నారు.

**విస్తృతంగా గోదాముల నిర్మాణం**

రైతులు పండించిన పంటను భద్రపరుచుకునేందుకు వీలుగా రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం మేర పెంచేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కోల్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల వసతులు, విద్యా ప్రమాణాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తుంది

- రాకొండ గ్రామంలో రూ. 1 కోటి 54 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు
- రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంది
- ఇంటర్మీడియట్ టాపర్ గా మార్కులు సాధించిన విద్యార్థి అనుషకు ఘన సత్కారం
- నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- నాగర్ కర్నూల్ శాసనసభ్యుడు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 22 (మనం బ్యూరో): సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం, విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని కేజీబీవీలు, ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సమగ్ర అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో సంక్షేమ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండలం రాకోండ కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ. 1 కోటి 54 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అదనపు తరగతి గదులు ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ...., గ్రామీణ పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. కేజీబీవీలు, గురుకులాలు వంటి సంస్థలను



బలోపేతం చేయడం ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పి, అన్ని కులాలకు సంబంధించిన విద్యార్థులకు సమాన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేలా ప్రత్యేకంగ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ తరగతి గదుల ద్వారా విద్యార్థులకు మరింత అనుకూలమైన విద్యా, వాతావరణం కలుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ....నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎలాంటి రాజీ పడబోమని కలెక్టర్ స్పష్టించేశారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు



సదుపాయాల అభివృద్ధిపై కూడా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు అవసరమైన అవకాశాలను కల్పించి విద్యార్థుల విద్యా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల భాగంగా విద్యార్థులకు అవసరమైన మూలిక వసతులపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైన అందుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానంలోకి ముందు వరుసలో ఉండాలని, విద్యార్థులు మరిన్ని ఉన్నత చదువులు అధిరోహించి ఉన్నత స్థానంలోకి రాణించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించిన విద్యార్థిని అనిషా ను కలెక్టర్ ,ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం.. గ్రామ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల ద్వారా సొంత ఇల్లు కల సాధనలో ప్రభుత్వం సహకారం అందిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, మండల విద్యాధికారి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారి హసీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శేష సాయి మోక్ష మందిర వార్షికోత్స వేడుకలు

- కళ్యాణోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- అందరిని ఆకట్టుకుంటున్న సాంస్క ృతిక కార్యక్రమాలు
- వైభవంగా పల్లకి సేవ



గజ్వేల్ ఏప్రిల్ 22 మనం న్యూస్. గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీప్రసన్న గారు కాలనీలో వెలసిన శ్రీ శేష సాయి మోక్ష మందిరం 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నుండి ప్రారంభమైన ఈ వార్షికోత్సవ వేడుకలు బుధవారంతో ముగిసాయి. దీనిలో భాగంగా సోమవారం నాడు గణపతి పూజతో ప్రారంభించి దేవత ఆహ్వానము అగ్ని ప్రతిష్ట ఆరాధన మంత్రపుష్పము లక్ష్మీ గణపతి మోదుగ హోమాన్ని నిర్వహించడం జరిగింది. మంగళవారం నాడు దేవత పూజ మంత్రపుష్పం మంగళహారతి తో పాటు ప్రజలందరూ ఆరోగ్యరీత్యా బాగుండాలని శ్రీ ఆంజనేయ స్వామికి లక్ష నాగవల్లి దళార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. బుధవారం ఉదయం దేవత హోమము బలి పూర్ణాహుతి అలాగే సాయినాథ విగ్రహానికి క్షీరాభిషేకము దత్తాత్రేయ స్వామికి, మరకత లింగేశ్వర స్వామికి పంచామృత అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అలాగే మధ్యాహ్నం శ్రీ లక్ష్మీ నారాయణ ఉమామహేశ్వర స్వాములవార్ల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాలకు పట్టణంలోని ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి భగవాన్ నామాన్ని ఆరాధించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మొత్తము పట్టణ ప్రముఖ పూజారి చాడ నంద బాల శర్మతోపాటు అవినాష్ మిశ్రా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. బుధవారం రాత్రి శ్రీ సాయినాథ విగ్రహాన్ని పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం ముందు మహిళల కోలాటలతో పాటు పురుషుల నృత్యాలతో ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఆలయం నుండి ప్రారంభమైన ఈ పల్లకి సేవ గాంధీ చౌరస్తా, వివేకానంద చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుండి ఇందిరాపార్చర్ వద్దకు వెళ్లి అక్కడి నుండి తిరిగి శేష సాయి మందిరం వరకు ఈ పల్లకి సేవ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల మెట్టయ్య, ఎర్రం శ్రీనివాస్, ఎల్లు రామిరెడ్డి, ఎస్ వి సిల్క్ శ్రీనివాస్, భాస్కర్,సదానందం, ఉప్పల శ్రీనివాస్, గౌరిశెట్టి హరి తో పాటు తదితరులు పాల్గొన్నారు. ప్రతిరోజు నిర్వహించిన సంస్క ృతి కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఎంతగానో అలరించాయి.

# ఐఐటి-జెఇఇ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యా సంస్థల విజయకేతనం



కరీంనగర్, ఏప్రిల్ 22(మనం బ్యూరో).: మెయిన్స్-2026 ఫలితాలలో, మన శ్రీ చైతన్య విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుతమైన ర్యాంకులను సాధించారు. వివిధ కేటగిరీలలో ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య ప్రతిభావంతులు వరుసగా: ఎం. సిరిచందన 143, టి. సాయి సిరి 164, ఎం. శ్రీసంజన 1008, కె. అభినవ్ 1141, బి. అంజి 2010, పి.ఎస్. 5699, కె. 7074, ఎం. శ్రీరామ్ రెడ్డి 14515, భుక్య శ్రీవిద్య 15870, గుర్లవత్ యోగేశ్వర్ 17557, గుగ్లవత్ పల్లవి 19745. అఖిల భారత ర్యాంకులు సాధించినందుకు అభినందనలు తెలిపారు. అంతేకాక, జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులలో 50% మంది ఐఐటి అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హత సాధించడం ద్వారా శ్రీ చైతన్య మరో సంచలనం సృష్టించిందన్నారు. శ్రీ చైతన్య విద్యార్థులు ఐఐటి మరియు మెయిన్స్లో సీట్లు సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. శ్రీ చైతన్య విద్యార్థులు రాబోయే అడ్వాన్స్డ్ పరీక్షలో కూడా జాతీయ స్థాయిలో అగ్ర ర్యాంకులు సాధించి, ప్రతిష్టాత్మక ఐఐటీలలో సీట్లు సంపాదిస్తారని మేము విశ్వసిస్తున్నామన్నారు. మెయిన్స్-2026లో అగ్ర ర్యాంకులు సాధించిన మన శ్రీ చైతన్య ప్రతిభావంతులకు, వారి తల్లిదండ్రులకు చైర్మన్ రమేష్ రెడ్డి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల డైరెక్టర్ కారా నరేందర్ రెడ్డి , డీన్ జగన్ మోహన్ రెడ్డి , జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్లు, ఏజీఎం శ్రీనివాస్ , బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సర్వేపల్లి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ పేరెంట్స్ డే వేడుకలు

- హాజరైన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




కర్నూలు ఏప్రిల్ 22మనం న్యూస్ స్థానిక కృష్ణానగర్లోని సర్వేపల్లి విద్యాసంస్థలయందు ప్రీ-ప్రైమరి ప్రైమరి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే. పేరెంట్స్ డే వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల నియోజక వర్గ పార్లమెంటు సభ్యురాలు టి.డి.పి నేషనల్ జనరల్ సెక్రటరీ డా.బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్డే మరియు పేరెంట్స్డే కలిపి నిర్వహించడం నిజంగా అభినందనీయం అని ఆమె అన్నారు. మరియు విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలు, నీతినియమాలు, క్రమశిక్షణ, దేశభక్తి పాఠశాలస్థాయి నుండే అలవర్చుకోవాలని ఆమె తెలిపారు. సర్వేపల్లి పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ స్కూల్ డైరెక్టర్ పి. దీక్షిత్ తమ పాఠశాలలో ఇప్పుడు అవలంబిస్తున్నటువంటి ఐఐటి, నీట్ విద్యా విధానంతో పాటు కేమ్ బ్రిడ్జ్ కరికులమ్, 21 ట్ట సెంచరి స్కిల్స్, కోడ్ స్కూల్ ఫిన్లాండ్ ఎడ్యుకేషన్ ఇంకా కొత్త విద్యావిధానాలన్నింటిని రాబోయే విద్యాసంవత్సర నుండి అమలు చేస్తామని, సివిల్ సర్వీసెస్ గురించి అవగాహనా కార్యమ్రాలు మరియు కోచింగ్ కూడా తనే స్వయంగా ఇవ్వబోతున్నామని యం.పి డా. బైరెడ్డి శబరి కి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇంత విజయవంతంగా ఈ కార్యక్రమం జరగడానికి తోడ్పడిన యం.పి. శ్రీమతి డా. బైరెడ్డి శబరి గారిని, విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ఎంతగానో అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మే 18 నుంచి క్రీడా యువజన కార్యక్రమాలు

- ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక
- మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి

హైదరాబాద్, ఏప్రిల్ 22 : ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా యువజన క్రీడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా క్రీడల శాఖ రూపొందించిన యువజన క్రీడోత్సవాల పోస్టర్ను ఈరోజు ఉదయం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ప్రజా పాలన యొక్క ప్రధాన లక్ష్యం ప్రజలకు ప్రభుత్వ సేవలను వారి వద్దకే తీసుకెళ్లడం అని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.

మే 1 నుండి 12 వరకు జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు, అలాగే మే 18 నుండి 23 వరకు యువజన కేంద్రిత కార్యక్రమాలను క్రింది విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు: మే 18 రాష్ట్రవ్యాప్తంగా మరథాన్ రన్ మరియు ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు

**మే 19: కెరీర్ స్కిల్ డెవలప్మెంట్ డే**

**మే 20: యూత్ లీడర్షిప్ సమ్మిట్స్**

**మే 21: క్రీడా దినోత్సవం**

**మే 22: యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ సర్వ్ అండ్ సపోర్ట్ కార్యక్రమం**

**మే 23: ఉద్యోగ సాధన కార్యక్రమం**

ఈ కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా యువజనులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఉద్యోగ మేళాలు మరియు ఇతర కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో



మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యే విధంగా జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఏ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్ గారు మాట్లాడుతూ, ఇటీవల గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో నిర్వహించిన సీఎం కప్ 2025 రెండవ ఎడిషన్లో సుమారు 5.64 లక్షల మంది క్రీడాకారులు ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువజనులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డా. సోనిబాలా దేవి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శ్రీ నిఖిల్ చక్రవర్తి, యువజన సర్వీసులు జాయింట్ డైరెక్టర్ శ్రీ వేణుగోపాల్, స్పోరట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డా. రవితేజ, టాస్క్ సీఈఓ శ్రీ నితిన్ రెడ్డి, డిఐడి అధికారి శ్రీ రాజేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ పీఆర్ఓ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం... ఆరోగ్యం కాపా డుకుందాం




- రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణి
- కె.శ్రీనువాసులు,అధ్యక్షులు

కర్నూల్, ఏప్రిల్ 22(మనంన్యూస్):కర్నూలు నగరం,సమాచార శాఖ భవన్ ప్రాంగ ణంలో బుధవారం రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే.శ్రీనివాసులు ఆధ్వ ర్యంలో వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...ఆరోగ్యం కాపాడుకుందాం అనే నినాదంతో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్ర మానికి సమాచార శాఖ డిడి కె.జయమ్మ,సెట్కూ రు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్,ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం(ఏపీజేఫ్) జిల్లా అధ్యక్షులు,టి.రామ కృష్ణ,మెడిక వర్ హాస్పి టల్ సిబ్బంది జనరల్ మెడిసిన్ డాక్టర్ సరయు రెడ్డి,జి.ఎం.డాక్టర్ మ హేశ్వర్ రెడ్డి,ఎజి ఎం ఎస్.ఖాదర్ బాషా హాజర య్యారు.అనంతరం వారి చేతుల మీదుగా జర్న లిస్ట్ లకు టోపీలు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిక్షణం సమాజంలో జరి గే విశేషాలను సే కరించి,వార్తలుగా ప్రచురణ చే స్తూ ప్రజలను చైత న్యం చేయడంలో జర్నలిస్ట్ ల పాత్ర ప్రధమంగా ఉందన్నారు.వార్తల సేకరణలో జర్నలిస్ట్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు.ఇలాంటి జర్నలిస్ట్ లను వే సవి తాపం నుండి కాపాడేందుకు తమ తృణసా యంగా రాయల సీ మ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.శ్రీనువాసులు టోపీలు పం పిణి చేయడం అభి నందనీయం అని కొనియా డారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేష న్ నాయకులు భూపాల్,జి ల్లా అధ్యక్షులు,విచ క్షణ దినపత్రిక ఎడిటర్ ర ఘు,రాములు దినపత్రిక ఎడిటర్ చంద్రశేఖర్,జ ర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

బేతంచేర్ల ఏప్రిల్ 22 (మనం న్యూస్) మండల పరిధిలోని గోరుమానకొండ తాండా సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న వంట ఏజెన్సీ పై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకొని తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యాన్న ఉదయ్ కుమార్ మండల కార్యదర్శి ప్రదీప్ లు స్థానిక మండల విద్యాధికారి కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం మండల విద్యాధికారి 2 అబ్రహం గారికి వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఖాదిర్ విష్ణు సుదర్శన్ మురళీకృష్ణ సునీల్ అబ్దుల్లా మురళి మహేష్ చరణ్ మధు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# సిపిఐ ఎంఎల్ పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవం




కర్నూలు ఏప్రిల్ 22మనం న్యూస్: ఈ భారత దేశ విముక్తికి మార్క్సిజం,లెనినిజం, మావో ఆలోచన విధానాల వెలుగులో జరిగే పోరాటాలే సరైన మార్గమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కర్నూలు నగరంలో గోకారి కాలనీ నందు మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ 146వ జయంతి, సిపిఐ(ఎం-ఎల్) 57 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సుత్తి కొడవలి జెండాను నగర కార్యదర్శి వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి , పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ మాట్లాడుతూ భారత దేశ విముక్తి కోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం,దోపిడీ, పీడన, అణిచివేత, కులమతాలు లేని సమ సమాజ నిర్మాణం కోసం, మార్క్సిజం, లెనినిజం,మావో ఆలోచన విధానమే సరైన మార్గమని అన్నారు. దేశంలో అసమానతలు, అవినీతి ఉన్నంతవరకు వర్గ పోరాటాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యూ నగర అధ్యక్షులు సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి తిరుపాల్, పీ డీ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ప్రగతిశీల మహిళా సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు మౌలాభి, లక్ష్మీదేవి, ఎల్లమ్మ, ప్రగతిశీల ఆటో మోటార్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, మల్లికార్జున, ఓబులేష్ మొదలైన వారు పాల్గొన్నారు.

# నేడు గంగా పుష్కరోత్సవం

ఏప్రిల్22,వ ు న ంన్యూస్ః వ ుహాన ంది పుణ్యక్షేత్రం లో నేడు గంగా పుష్కరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 6 గంటలకు రాజగోపురం వద్ద గంగా దేవి ఉత్సవ మూర్తులకు ఉపచార పూజలు చేసి గంగాదేవిని వేదమంత్రాలతో ,మంగళ వాయిద్యాలతో స్వాగతం పలకడం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు స్నానం చేసే అవకాశం కల్పిస్తామన్నారు.12 సంవత్సరాలకు ఒక సారి వచ్చే గంగానదిలో పుష్కర స్నానం చేసినంత పుణ్యం కలుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



# బెంగాల్లో ఏటా లక్ష ఉద్యోగాలిస్తాం


## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హామీ



**కోల్‌కతా, ఏప్రిల్ 22:** పశ్చిమ బెంగాల్‌ను చొరబాటుదారులు లేని రాష్ట్రంగా మార్చేందుకు ఈ ఎన్నికలు ప్రజలకు లభించిన ఓ అవకాశమని, తాము అధికారంలోకి వస్తే ప్రతిభ ఆధారంగా ఏటా యువతకు లక్ష ఉద్యోగాలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. శాల్బనీ, పశ్చిమ బర్ధమాన్‌లోని కుల్‌టీలలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. 'ఒకప్పుడు ఇనుప ఖనిజ ఉత్పత్తికి కేంద్రంగా కుల్‌టీ ఉండేది. కానీ మమతా బెనర్జీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేశారు. మేం అధికారంలోకి వస్తే కుల్‌టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం. అక్రమ మైనింగ్‌ను అరికట్టి ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని సృష్టిస్తున్న స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిపై నిషేధం విధిస్తాం. బెంగాల్లో కొత్తగా పుట్టుకొస్తున్న సిండికేట్, మాఫియా, గూండా రాజ్యానికి ముగింపు పలుకుతాం. ఓ నిర్దిష్ట వర్గానికి చెందినవారు ఒకేసారి 4 పెళ్లిళ్లు చేసుకోకుండా అరికట్టేందుకు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తాం. మేం రామ మందిరం నిర్మిస్తే.. మమత సన్నిహితుడు హుమాయూన్ కబీర్.. బాబ్రీ మసీదు కట్టేందుకు యత్నిస్తున్నారు. భారత్‌లో అంతర్భాగమైన బెంగాల్లో బాబ్రీ మసీదును నిర్మించాలని ఎవరనుకున్నా సహించేది లేదు' అని అమిత్ షా హెచ్చరించారు. దశాబ్దాలుగా ఉన్న గూర్ఖా సమస్యను ఆరు నెలల్లోగా పరిష్కరిస్తామని డార్జిలింగ్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన హామీ ఇచ్చారు.

# ధోని కఠిన శిక్షణ.. నా ఆలోచనను మార్చింది

## విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ వినోద్ భాటియా వెల్లడి



**ఢిల్లీ, ఏప్రిల్ 22:** క్రీడాకారులకు ఆర్మీ, వాయు, నేవీలో గౌరవ హోదాలను కేటాయిస్తూ ఉండటం సహజం. అర్హత పరీక్షలు రాసి వచ్చిన వారి మాదిరిగా వీరికి కఠిన శిక్షణ తప్పనిసరి ఏమీ కాదు. అలాగే, ఏదైనా విపత్కర పరిస్థితుల్లో తమ సేవలను అందించాలనుకుంటే ఆయా విభాగాలకు వెళ్లవచ్చు. ఇందులోనూ తప్పనిసరిగా పాల్గొనాలనే నిబంధన ఉండదు. అయితే, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని మాత్రం తన లెఫ్టినెంట్ కర్నల్ పదవికి న్యాయం చేశారు. కఠినమైన శిక్షణనూ తీసుకోవడం గమనార్హం. నియంత్రణ రేఖ వద్ద పహారాకూ వెళ్లారు. దీంతో ధోనికి హోదా ఇవ్వడంపై మొదట్లో ఉన్న తన ఆలోచనాతీరులో మార్పు వచ్చినట్టు విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ వినోద్ భాటియా వెల్లడించారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"వీకే సింగ్ మా చీఫ్‌గా ఉన్నారనుకుంటా. భారత జట్టుకు సారథిగా వ్యవహరించిన ఎంఎస్ ధోనికి గౌరవ లెఫ్టినెంట్ కర్నల్ పదవి ఇవ్వాలని నిర్ణయించారు. నేను కాస్త సంకోచంలో పడ్డా. పారాచూట్ అర్హత కలిగిన సిబ్బందికి ఇచ్చే మెరూన్ బెరెట్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. పారాట్రూపర్ కావాలంటే తప్పకుండా ఆరు నెలల ప్రొబేషన్ పీరియడ్‌లో కఠిన శిక్షణ తీసుకోవాలి. ఇది చాలా కష్టమైంది కూడానూ. ఇక్కడ సెలక్షన్ రేట్ కేవలం 20 శాతం మాత్రమే. కానీ, ఎలాంటి శిక్షణ లేకుండానే ఇలా మెరూన్ బెరెట్‌ను ఇవ్వడం తప్పుడు సంకేతాలు పంపుతుందని భావించా" అని వినోద్ భాటియా తెలిపారు. అయితే కఠినమైన పారా జంపింగ్ శిక్షణను ధోని విజయవంతంగా పూర్తిచేయడాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.

### యూనిఫామ్ గౌరవాన్ని..

" దేశం కోసం ఎంఎస్ ధోని చాలా సేవలు అందించారు. టీమ్‌ఇండియా గర్వపడేలా చేశారు. అతడిపట్ల నేనూ గర్వపడ్డా. 'కెప్టెన్ కూల్' అని అభిమానులు పిలుచుకుంటారు. ఓ సందర్భంలో ఎత్తు నుంచి దూకడం తనకు చాలా భయమని నాతో చెప్పినట్లు గుర్తు. ఇలాంటి కఠినమైన శిక్షణ ఎలా పూర్తి చేస్తాడో అని అనుకున్నా. కానీ, వాటన్నింటినీ పక్కన పెట్టేసి పారా ట్రూపర్ జంప్స్‌ను కూడా పూర్తి చేసేశాడు. యూనిఫామ్ గౌరవాన్ని నిలబెట్టాడు. సిసలైన సైనికుడిగా వ్యవహరించాడు. జమ్ముకశ్మీర్‌లో మా యూనిట్‌తో కలిసి సేవలు అందించాడు. మిగతావారిలోనూ చాలా స్ఫూర్తి నింపాడు. నా ఆలోచనా తీరును పూర్తిగా మార్చేశాడు" అని ధోనిపై వినోద్ భాటియా ప్రశంసల వర్షం కురిపించారు. ఎంఎస్ ధోనికి 2011లో లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హుదా వరించింది. 2015లో పారాచూట్ శిక్షణను పూర్తి చేసి పారాట్రూపర్‌గా అర్హత సాధించారు. దీంతో 'మెరూన్ బెరెట్', 'పారా వింగ్' చిహ్నాలను ధరించేందుకు అనుమతి సాధించినట్లైంది.

# ఢిల్లీలో ఐఆర్ఎస్ కుమార్తె హత్య..!

## లైంగిక దాడి.. ఆపై కేబుల్‌తో ఉరి



**ఢిల్లీ, ఏప్రిల్ 22:** దేశ రాజధాని ఢిల్లీలో ఐఆర్ఎస్ అధికారి కుమార్తె హత్యకు గురయ్యారు. అమర్ కాలనీలోని నివాసంలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు ఉదయం ఐఆర్ఎస్ అధికారి, ఆయన భార్య జిమ్‌కు వెళ్లారు. అప్పుడు వారి కుమార్తె ఒక్కరే ఇంట్లో ఉన్నారు. వారు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఆమె అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయి కనిపించింది. దీనిపై సమాచారం అందడంతో.. పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు ఘటనాస్థలాన్ని పరిశీలించాయి. గతంలో ఆ ఇంట్లో పనిచేసిన యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆరు వారాల క్రితమే అతడిని పనిలో నుంచి తొలగించారు. ఘటనకు కొన్ని గంటల ముందు అతడు ఇంటి పరిసరాల్లో తిరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గుర్తించారు. సమయం కోసం వేచి చూసిన నిందితుడు.. ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించి, ఇంట్లోకి చొరబడి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. లైంగిక దాడి చేసి, మొబైల్ ఫోన్ ఛార్జింగ్ కేబుల్‌తో గొంతుకు ఉరి బిగించి చంపేసినట్టుగా ఉన్న గుర్తులను స్వాధీనం చేస్తున్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. ప్రస్తుతం నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతురాలి తండ్రి ఆదాయపన్ను విభాగంలో సీనియర్ అధికారి. ఆ యువతి ఇంజినీరింగ్ పూర్తి చేసి, యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతోంది.




# భారత విమానాలపై నిషేధాన్ని పొడిగించిన పాక్

**ఇస్లామాబాద్/ఢిల్లీ, ఏప్రిల్ 22:** భారత విమానాలు తన పరిధిలోని ఆకాశ మార్గంలో ప్రయాణించటంపై ఏడాది క్రితం విధించిన నిషేధాన్ని పాకిస్థాన్ మరో నెలపాటు పొడిగించింది. మే 24 వరకూ నిషేధం అమలులో ఉంటుందని పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకటించింది. గతంలో విధించిన నిషేధం గడువు ముగియడానికి కొన్ని రోజుల ముందే పాక్ తాజా ఆదేశాలు జారీ చేసింది. భారత్ కూడా తన ఆకాశ మార్గాన్ని పాక్ విమానాలు ఉపయోగించకుండా విధించిన నిషేధాన్ని పొడిగించే అవకాశం ఉంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్తతల కారణంగా భారత, పాకిస్థాన్‌లు పరస్పరం ఆకాశ మార్గ నిషేధాన్ని విధించుకున్నాయి. తన ఆకాశ మార్గం వినియోగంపై విధించిన నిషేధం భారత వాణిజ్య ఎయిర్లైన్లపై ప్రతికూల ప్రభావం చూపిందని పాక్ పేర్కొంటోంది. భారత్లోని వివిధ నగరాల నుంచి పశ్చిమాసియాకు వెళ్లే అనేక విమానాలు నిషేధానికి ముందు పాకిస్థాన్ గగనతలం మీదుగా నడిచేవి.

# ఇప్పట్లో చర్చలు లేనట్లే..

## జేడీ వాన్స్ బృందం పాక్ పర్యటన వాయిదా..!



**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** అమెరికా- ఇరాన్ మధ్య ఇప్పట్లో చర్చలు జరిగే సూచనలు కన్పించట్లేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్ పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. సంప్రదింపులకు సంబంధించి ఇరాన్ నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. వైట్‌హౌస్ వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడుతున్నాయి.

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగియడానికి ముందే.. చర్చల కోసం జేడీ వాన్స్ బృందం ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సిఉంది. అయితే, చర్చలకు సంబంధించి ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. మరోవైపు తమ నౌకలపై విధించిన దిగ్బంధనం ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామని ఇరాన్ గతంలో తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే వాన్స్ నేతృత్వంలోని బృందం పాక్ పర్యటన వాయిదా పడినట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే, ఇది పూర్తిగా రద్దు కాలేదని, కేవలం వాయిదా మాత్రమేనని స్పష్టంచేశాయి. వాన్స్ బృందం ఎప్పుడైనా పాక్ పర్యటనకు బయలుదేరవచ్చని వెల్లడించాయి.

ఇస్లామాబాద్‌కు తమ ప్రతినిధి బృందాన్ని పంపాలా, వద్దా అనే దానిపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్‌లో అమెరికా దిగ్బంధనం, వాణిజ్య నౌకను స్వాధీనం చేసుకోవడం గురించి ఆయన ప్రస్తావించారు. ఈ చర్యల కారణంగా చర్చల్లో వాషింగ్టన్ చిత్తశుద్ధిపై ఆయన అనుమానం వ్యక్తంచేశారు. మరోవైపు.. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఒక ప్రణాళికతో ఆ దేశం ముందుకువచ్చేవరకు ఇది కొనసాగుతోందన్నారు. అయితే, హర్మూజ్ వద్ద తమ దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశారు.

# పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్..హమాస్ మధ్య బలపడిన బంధం


## కేంద్ర దర్యాప్తు బృందం వెల్లడి



ఢిల్లీ, ఏప్రిల్ 22: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత హమాస్- పాక్ ఉగ్రవాదుల మధ్య సంబంధాలు బలపడినట్టు తెలుస్తోంది. పహల్గాం ఘటన కూడా హమాస్ అమలుచేసే ప్రణాళికలు, శైలిలోనే జరిగినట్టు కేంద్ర దర్యాప్తు బృందం పేర్కొంది. గతేడాది ఏప్రిల్ నుంచి పాక్ ఉగ్ర బృందాలు హమాస్‌తో ఇప్పటివరకు కనీసం నాలుగుసార్లు సమావేశమైనట్టు వెల్లడించింది. ఆ సమావేశాలు రహస్యంగా వివిధ ప్రాంతాల్లో జరిగినట్టు దర్యాప్తు బృందం గుర్తించింది. పాకిస్థాన్ ఆక్రమిత్ కశ్మీర్, పాకిస్థాన్ నగరాల్లో, బంగ్లాదేశ్‌లో హమాస్- పాకిస్థాన్ ఉగ్ర బృందాలు సమావేశమైనట్టు దర్యాప్తులో తేలింది. ఈ సమావేశాల్లో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ బృందాలు కూడా పాల్గొన్నట్లు సమాచారం. హమాస్-పాకిస్థాన్‌ల మధ్య పొత్తుల విషయంలో అవి తమ సిద్ధాంతాలను దాటి పరస్పర కార్యాచరణను అమల్లోకి తెచ్చేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఈ రెండు బృందాలు ప్రణాళికలను అమలుచేయడానికి ప్రాంతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటున్నాయని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దీంతో దర్యాప్తు ఏజెన్సీలు నిఘా బృందాల్ని అప్రమత్తం చేశాయి. అయినా నూతన పరిణామాలు భద్రతా వర్గాల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.

# భారత్ జోలికి వస్తే..

## పాకిస్థాన్‌కు రాజనాథ్ సింగ్ వార్నింగ్



**బెర్లిన్, ఏప్రిల్ 22:** పహల్గాం ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈక్రమంలోనే రక్షణమంత్రి రాజనాథ్ సింగ్ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. జర్మనీలో ఏర్పాటు చేసిన ఓ సభలో ఆయన మాట్లాడుతూ భారత్‌ను ప్రమాదంలో పడెయ్యాలని చూస్తే దేశ ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు.

"ఇప్పటి వరకు భారత్ చరిత్రను పరిశీలిస్తే కావాలని ఎవరిపైనా దాడి చేయలేదు. పొరుగుదేశాలు భారత్‌ను ప్రమాదంలో పడెయ్యాలని చూస్తే 'డాట్, డాట్, డాట్..' ప్రతిస్పందన అదే స్థాయిలో ఉంటుంది" అని పాక్ పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. పొరుగుదేశాలన్నీ సఖ్యతగానే ఉన్నాయని, సమస్యలను సృష్టించేది ఆ ఒక్కటి మాత్రమేనని పరోక్షంగా పాకిస్థాన్‌పై విమర్శలు గుప్పించారు. భారత సైనిక వ్యవస్థ ఇంతకుముందు కంటే దృఢంగా మారిందని, ఆపరేషన్ సిందూర్‌లో ఏం చేసిందో మీకు తెలిసే ఉంటుంది కదా! అని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్ తమ పట్ల తప్పుగా వ్యవహరిస్తే కోల్‌కతాపై దాడి చేస్తామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పహల్గాం దాడి ఘటనకు ఏడాది పూర్తయిన వేళ రక్షణ మంత్రి పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. 'గతేడాది ఏప్రిల్ 22న పిరికిపందలు చేసిన పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు నా హృదయపూర్వక నివాళులు. వారి కుటుంబ సభ్యుల బాధను మేం ఎల్లప్పుడూ పంచుకుంటాం. జాతికి తగిలిన దెబ్బను ఎప్పటికీ మర్చిపోలేం' అని రాజనాథ్ సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# సగానికి పడిపోయిన క్షిపణుల నిల్వలు

- ఆందోళనలో అగ్రరాజ్యం
- ఇరాన్ సైనిక సామర్థ్యంతో ఉంది
- పెంటగాన్ నిఘా విభాగం



**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** ఆయతుల్లా ఖమేనీని అంతం చేయడంతో ఇరాన్లో పాలన కూలిపోతుందని అమెరికా వేసిన అంచనాలు తలకిందులు కావడంతో ఇరాన్‌తో సుదీర్ఘంగా యుద్ధం నడుస్తోంది. దీంతో కీలక క్షిపణుల నిల్వలు క్షీణిస్తుండటం అగ్రరాజ్యాన్ని కలవరానికి గురిచేస్తోంది. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. పేట్రియాట్, థాడ్ ఇంటర్సెప్టర్ నిల్వలు సగానికి పడిపోయాయి. తోమహాక్ క్షిపణి నిల్వలు కూడా 35 శాతం మేర ఆవిరయ్యాయని పేర్కొన్నాయి. ప్రిసిషన్ స్ట్రైక్ మిస్సైళ్ల నిల్వలో 45 శాతం కంటే ఎక్కువ వాడారు. ఈ స్థాయి వినియోగం అమెరికా సైనిక సన్నద్ధతలో లోపాలను ఎత్తి చూపుతోందని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. స్వల్పవ్యవధిలో సైనిక కార్యకలాపాలకు ఈ నిల్వలతో ఢోకా లేనప్పటికీ.. మరే ప్రాంతంలో భారీ ఘర్షణలో పాల్గొనాల్సి వస్తే ఈ ఆయుధ నిల్వలపైనే ఆధారపడే పరిస్థితి లేదన్నారు. అదే సమయంలో ఇరాన్ కీలక సైనిక సామర్థ్యాలను కలిగి ఉందని పెంటగాన్ నిఘా విభాగం అంచనావేసింది. ఇటీవల ఆపరేషన్ తర్వాత కూడా ప్రాంతీయ శక్తిగా మిగిలే ఉందని పేర్కొంది. ఆ దేశ సైనిక సామర్థ్యాలను భారీగా దెబ్బతీశామని ట్రంప్ యంత్రాంగం చేస్తోన్న ప్రకటనలకు ఈ అంచనాలు భిన్నంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్ కంటే డొనాల్ ట్రంప్‌నకే ఒప్పందం ఎక్కువ అవసరంగా కనిపిస్తోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# నాగాలాండ్ మంత్రి మాంసాహారంతో


## బెంగాల్ సీఎం మమతాబెనర్జీకి కౌంటర్



**కోహిమా, ఏప్రిల్ 22:** మాంసాహారం ముందుపెట్టుకొని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీకి నాగాలాండ్ మంత్రి తెమ్జెన్ ఇమ్నా అలోంగ్ కౌంటర్ ఇచ్చారు. "మమతా దీదీ..నేను బీజేపీలోనే ఉన్నాను. నేను మాంసాహారిని" అని ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే చేపలు, మాంసం, గుడ్ల వినియోగంపై నిషేధం విధిస్తుందని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపిస్తోన్న సంగతి తెలిసిందే. "బెంగాల్ ప్రజలు చేపలు, బియ్యం భుజిస్తారు. మీరు చేపలు తినకూడదని చెప్తే.. మరి వాళ్లు ఏం తినాలి" అని మమత ఎన్నికల ప్రచారంలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఈ ప్రచారాన్ని బీజేపీ పలుమార్లు ఖండించింది. తాజాగా నాగాలాండ్ మంతిర తెమ్జెన్ ఇమ్నా ఒక వీడియో షేర్ చేశారు. మాంసాహారంతో పాటు ఇతర వంటకాలు ఉన్న ప్లేట్ ముందు పెట్టుకొని తినడానికి రెడీగా ఉన్నారు. ఇప్పుడు ఈ వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది. అలాగే మమత ఇతరులతో కలిసి వేదికపై నృత్యం చేస్తోన్న వీడియోను షేర్ చేశారు. ఆమెను డ్యాన్స్ చేయనీయండి అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్య రాసుకొచ్చారు.

# చమురే ఖర్గ్ ద్వీపాన్ని ముంచేస్తుంది

- అమెరికా మంత్రి హెచ్చరికలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** ఇరాన్ మెడలు వంచి.. దాన్ని ఎలాగైనా ఒప్పందంలోకి తీసుకురావాలని అమెరికా గట్టిగా ప్రయత్నిస్తోంది. దాన్ని ఆర్థికంగా మరింత ఇబ్బందిపెట్టేందుకు.. హర్మూజ్ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. దానిని ఉద్దేశించి అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. దిగ్బంధనంతో ఇరాన్ చమురు ఎగుమతులు ఆగిపోయి.. ఖర్గ్ ద్వీపం నిల్వలతో నిండిపోతుందన్నారు.

పర్షియన్ గల్ఫ్‌లో ఒక చిన్న ద్వీపమైన ఈ ఖర్గ్.. ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైనది. ఇక్కడినుంచే దాదాపు 90 శాతం ఎగుమతులను ఇరాన్ నిర్వహిస్తోంది. ఈ దిగ్బంధనం నేపథ్యంలో ఆ దేశ చమురు ఎగుమతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీనిపై బెసెంట్ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్ ఓడరేవులపై యూఎస్ దిగ్బంధనం కొనసాగుతోందని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంచేశారు. దీంతో కొన్ని రోజుల్లోనే ఖర్గ్ ద్వీపంలోని చమురు స్టోరేజీ ట్యాంకులు నిండిపోతాయి. కీలకమైన ఇరాన్ చమురు బావులు మూతపడతాయి. దీంతో ఆ దేశ ప్రధాన ఆదాయానికి గండి పడనుంది' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా టెహ్రాన్ ఆర్థిక సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు యూఎస్ ట్రెజరీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇరాన్‌తో రహస్య వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలు సాగించే వ్యక్తులు, నౌకలు యూఎస్ ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### ఇరాన్ ఆర్థికంగా కుప్పకూలుతోంది: ట్రంప్

ఇరాన్ ఆర్థికవ్యవస్థపై ట్రంప్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. అది ఆర్థికంగా కుప్పకూలుతోందన్నారు. నగదు కొరతతో టెహ్రాన్ అల్లాడిపోతోందంటూ ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. తమ దిగ్బంధనంతో రోజుకి 500 మిలియన్ డాలర్లు ఇరాన్ కోల్పోతోందని.. దీంతో హర్మూజ్ జలసంధిని అది తెరవాలనుకుంటుందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా తమకు జీతాలు అందడం లేదంటూ ఇరాన్ సైన్యం, పోలీసులు ఫిర్యాదులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.



## మున్సిపల్ సిబ్బందికి షూస్ పంపిణీ

**నేరేడుచర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** నేరేడుచెర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి కుమార్తె చిన్నారి నూకల మహాలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా నేరేడుచర్ల మున్సిపల్ సిబ్బందికి 60 జతల షూస్ లను బుధవారం అందించారు. నేరేడుచర్ల పట్టణంలో గల తన స్వగృహం నందు మున్సిపల్ చైర్మన్ కొనతం వెంకరెడ్డి చేతుల మీదుగా వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి వాటిని అందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, కౌన్సిలర్ శ్రీకాంత్, నన్నె పంగ శ్రీనివాస్ మాజీ కౌన్సిలర్ నూకల సుగుణ, సత్యనారాయణ రెడ్డి, యారవ శ్రీనివాస్, నూకల కళ్యాణి, మున్సిపాలిటీ సిబ్బంది ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకండి

## ధరిత్రిని (భూమి), ప్రకృతిని కాపాడండి

## అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ , ఏప్రిల్ 22 ( మనం న్యూస్):** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా దరిత్రితోపాటు, ప్రకృతి పెను విపత్తును ఎదుర్కొంటున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. 'అంతర్జాతీయ మాతృ భూమి' దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని కేంద్రీయ విద్యాలయ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని కేంద్రీయ విద్యాలయ వద్ద ఆయన జండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, మీడియాను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రపంచం పెను ప్రమాదంలో చిక్కుకుందని, దీనివల్ల వాతావరణ, జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు.మానవ తప్పిదాలు, వివాదాల వల్ల మనుషులతో పాటు, జంతుజాలానికి కూడా ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం అనంతరం డీకంపోస్టు చేయకపోవడం వల్ల ఇది భూమితోపాటు, ప్రకృతిని నాశనం చేస్తున్నదని, దీని నుండి బయట పడేందుకు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున మొక్కలు నాటి దరిత్రిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు . మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ఒక వేళ వాడినట్లైతే తిరిగి దానిని వినియోగించడం, రీసైకిల్, చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలని, ఈ నినాదం ప్రతి గృహానికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అప్పుడే మనం భూమిని, ప్రకృతిని కాపాడగలుగుతామని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా ప్రతి ఒక్కరూ బయటికి,లేదా మార్కెట్ కు వెళ్లేటప్పుడు




తప్పనిసరిగా కాటన్ చేతి సంచులు వాడాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కు బదులు స్టీల్ లేదా మట్టి బాటిల్స్ వాడడం, ప్లాస్టిక్ మెటీరియల్ వాడకుండా చూడాలని, ఈ విషయంపై అన్ని చోట్ల అవగాహన కల్పించాలని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్నిచోట్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రకృతిని కాపాడే అంశంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు.అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు భూమి కి ప్రతిరూపమైన అమ్మను గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేయాలని, అప్పుడే మనం అనుకున్న అందమైన జీవితాన్ని గడపగలుగుతామన్నారు.

డి ఎఫ్ ఓ రాజశేఖర్, జిల్లా యువజన ,క్రీడల అభివృద్ధి శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి తదితరులు ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీకి హాజరైన వారందరి చేత అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. అంతేకాక అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం పై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.




## అంగన్వాడి గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ

**చింతలపాలెం, ఏప్రిల్ 22(మనం న్యూస్):** మండల పరిధిలోని గుడిమల్కాపురం గ్రామంలో అంగన్వాడి సెంటర్-1లో ఈరోజు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ-స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు.అలాగే వచ్చే విద్యాసంవత్సరంలో మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడి కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రారంభ దశ నుంచే విద్య ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసింహారావు, గ్రామ కార్యదర్శి అనిత, ఏఎన్ఎం లు,అంగన్వాడి టీచర్లు, తల్లిదండ్రులు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహస్వామి తిరు కళ్యాణం ఏర్పాట్లు

**సూర్యాపేట, ఏప్రిల్ 22(మనంన్యూస్):** శ్రీలక్ష్మీనసింహస్వామి తిరు కళ్యాణోత్సవములకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మట్టపల్లి మహా క్షేత్రం, మఠపల్లి నందు శ్రీ స్వామివారి తిరు కల్యాణ మహోత్సవములు, ది.29.04.2026 నుండి 04.05.2026 వరకు నిర్వహించుటకు గాను ముందస్తు ఏర్పాట్ల పై సంబంధిత శాఖల అధికారులతో సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం లోని వి సి హాల్ నుండి బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వేబేక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇట్టి కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు వేలాది మంది భక్తులకు ఎటువంటి ఆటంకములు జరగకుండా మిషన్ భగీరథ శాఖ నిరంతరం నీటి సరఫరా చేయాలని, పోలీస్ శాఖ



వారిని పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు మరియు ఒక అంబులెన్స్ సిద్ధముగా ఉంచే విధముగా ఏర్పాటు చెయ్యాలని, ఆర్టీసీ కళ్యాణ మహోత్సవ ములకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని , విద్యుత్ శాఖ సరఫరాకు ఆటంకం కలగకుండా నిరంతరం సరఫరా ఉండే విధంగా చూడాలని, మట్టపల్లి గ్రామపంచాయతీ దేవాలయ పరిసర ప్రాంతాలు పారిశుధ్యం చేయుటకు, ఫైర్ సర్వీస్ వారిని ఫైర్ ఇంజన్ స్టాండ్ బై చేయుటకు, సాగర్ సిమెంట్ మరియు నాగార్జున సిమెంట్ వారి సహకారంతో భక్తులకు స్నాక్స్ అందించుట, దేవస్థానం వారు క్యూలైన్స్ ఏర్పాటు మరియు పార్కింగ్ స్థలంలో సీసీ కెమెరా ఏర్పాటు, వృద్ధులకి, దివ్యాంగులకు ఉచిత ఆటో ఏర్పాటు మొదలగునవి పకడ్బందీ ఏర్పాట్లు చేయవలసి నదిగా సూచనలు చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లి రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి యొక్క సహాయ సహకారాలు సేవా దృక్పథంలో అందించి శ్రీ స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవములు విజయవంతం చేయుటకు కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈఓ డి శిరీష, ఆర్డిఓ వి.శ్రీనివాసులు , కె భాస్కర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కే భాస్కర్, నల్గొండ, దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయకుమార్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల భూములు సస్యశ్యామలం చేస్తున్న మంత్రి



**పాలకీడు, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** పాలకీడు మండల పరిధిలోని బెట్టే తండా ఎత్తిపోతల పథకంతో గిరిజనుల భూములను సస్యశ్యామలం చేస్తున్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి గిరిజన రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని బెట్టే తండా సర్పంచ్ మాలోతు బుజ్జి మోతిలాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవీడు మండలం బెట్టేతండా సమీపంలో మూసీ నదిపై రూ 33.84 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించరు. పథకానికి నిధులు మంజూరి చేయడమే కాకుండా పలుమార్లు సందర్శించి పనులు వేగవంతంగా జరగాలని గుత్తేదారులను, అధికారులను ఆదేశించడం మంచి శుభ పరిణామన్నారు. ఇందులో భాగంగా ఎత్తిపోతల పథకం నుండి రైతుల పొలాలకు సాగునీరు వెళ్లే పైప్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి. కిషన్, వార్డు సభ్యులు బి.మధు నాయక్, ఎం శ్రీను, పి శ్రీను, నాయకులు ఎం సుధీర్, నాగేశ్వరరావు సందీప్ లు పాల్గొన్నారు.

## 4వ ప్లీనరీని విజయవంతం చేయాలి




**సూర్యాపేట, ఏప్రిల్ 22, మనం న్యూస్:** వచ్చే నెల 12 న హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి పార్టీ నాల్గవ రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో 4వ రాష్ట్ర ప్లీనరీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వం వహించారని, రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఉద్యమ సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలతో పార్టీ ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. జలవిహార్ లో జరుగబోయే ప్లీనరీ ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్, లీగల్ సేల్ జిల్లా అధ్యక్షులు చంద్రకాంత్, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, రైతు జనసమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు సుమన్ నాయక్, విద్యార్థి జన సమితి అధ్యక్షుడు బొమ్మగాని వినయ్, ఈశ్వర్, యువజన సమితి జిల్లా ప్రధానకార్యదర్శి నాగు నాయక్, మైనార్టీ సెల్ నాయకులు ఫరీద్, లోకేష్ పాల్గొన్నారు.

## తిరుమలగిరి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



**తిరుమలగిరి, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనౌగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు వంద శాతం హాజరైన పిల్లలకు బహుమతులను అందజేశారు. మున్సిపాలిటీ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి పాఠశాలకి బోరు మోటార్ చేపిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు చైర్మన్ , వైస్ చైర్మన్ ని వార్డ్ కౌన్సిలర్ ని శాలువులతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ సంకెపల్లి రఘునందన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఏమోజు గోవిందమ్మ రవీందర్, ఎంఈఓ శాంతయ్య, వార్డ్ కౌన్సిలర్ జక్కుల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**తిరుమలగిరి, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటీ 13వ వార్డు అంబేద్కర్ నగర్ కు చెందిన కొంగరి సోంమల్లు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన బుధవారం జరిగింది. ఇంట్లో ఉన్న సామాను పూర్తిగా కాలిపోయి సుమారు 8 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఏలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకోని చైర్మన్ ఎస్. రఘునందన్ రెడ్డి బాధితులను పరామర్శించి సహాయంగా రూ 5000/ లు అందజేశారు. చైర్మన్ వెంట 12వ వార్డు కౌన్సిలర్ కందుకూరి గీత బాబు ఉన్నారు.

## ప్రధాని మోడీపై వ్యాఖ్యలకు బిజెపి నిరసన

### ఖర్గే దిష్టిబొమ్మ దహనం.

**ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ దుమారాన్ని రేపాయి. ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు




నెల్లూరి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో, స్థానిక 1 టౌన్ అధ్యక్షులు నరేష్ గాడిల అధ్యక్షతన నగరంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద బీజేపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, మల్లికార్జున ఖర్గేకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధానిపై నోటిదురుసుగా ప్రవర్తించడం కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు.ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, మల్లికార్జున ఖర్గే తన స్థాయిని మర్చిపోయి తెలివి తక్కువ ప్రేలాపనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిపై ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఆయన విమర్శించారు. రాజకీయం అనేది ఎప్పుడూ గౌరవప్రదంగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రధాని మోడీపై దేశ ప్రజలు చూపిస్తున్న అపరిమితమైన అభిమానాన్ని చూసి తట్టుకోలేక, ఆ అక్కసుతోనే కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ఖర్గే తన వ్యాఖ్యలకు గాను వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఖమ్మం జిల్లా శాఖ తరపున డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెంకట్ గొంగుర, రుద్ర ప్రదీప్, జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా, రవి రాథోడ్, జిల్లా నాయకులు బోయినపల్లి సురేష్, మందడపు సుబ్బారావు, మేకల నాగేందర్, మార్తి ప్రసాద్, బోయినపల్లి శేఖర్, పొట్టిమూతి జనార్దన్, పిల్లలమర్రి వెంకట్, డీకొండ శ్యామ్, మేడ సంపత్, అనగాని రామారావు, అర్బన్ అధ్యక్షులు వాకదాని రామకృష్ణ, మండల స్థాయి నాయకులు పాలేపు రాము, పొట్టిమూతి వాణి, తుమ్మ ఇందు, ఊరుకొండ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి సమ్మె ప్రారంభం

### డిపో ఎదుట కార్మికుల ఆందోళన

### సమ్మెకు సిపిఐ ప్రజా సంఘాల సంపూర్ణ మద్దతు



**ఖమ్మం, ఏప్రిల్ 22(మనం న్యూస్):** ఆర్‌టిసి కార్మికుల సమ్మె బుధవారం ప్రారంభమైంది. ఆర్టీసి సమ్మెను పురస్కరించుకుని కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో మంగళవారం అర్థరాత్రి నుంచి ఖమ్మం డిపో వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. సిపిఐ, ఏఐటియుసి, ప్రజా సంఘాల కార్యకర్తలు సమ్మెకు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఆర్టీసి కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. 2019లో 52 రోజులు సమ్మె జరిగినప్పుడు సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని అప్పుడు ఏ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేశారో ఇప్పుడు అదే సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తునప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను మేము అధికారంలోకి రాగానే చేపడతామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందని హేమంతరావు ప్రశ్నించారు. ఆర్టీసి కార్మికులది గొంతెమ్మ కోర్కెలు కావని ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో ఇంత ప్రజాదరణ పొందుతుందంటే దాని వెనక కార్మికుల కష్టం ఉందన్నారు. పిఆర్సి అమలు కోసం 50 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినా ఈ ప్రభుత్వం కనీసం స్పందించ లేదని ఇప్పుడు మరో నాలుగు వారాల సమయం కోరడ మంటే కార్మికులను వంచించడమేనన్నారు. ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం జరిగేంత వరకు సమ్మె కొనసాగుతుందని సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తక్షణం ఆర్టీసి జేఏసిని చర్చలకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనం, పిఆర్సి అమలు, వేతన సవరణ తదితర అంశాలను పరిష్కరించాలని హేమంతరావు కోరారు. ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తోట రామాంజనేయులు, ఏఐటియుసి నాయకులు పిల్లి రమేష్, గాదె లక్ష్మి నారాయణ, పి. మోహన్రావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు తనిఖీ



**పాలకీడు, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** మండల పరిధిలోని గుడుగుంట్లపాలెం గ్రామపంచాయతీ నందు జరుగుతున్న ఉపాధి హామీ పనులు సహాయ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి యామిని బుధవారం ఆకస్మికంగా సందర్శించినారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి, పని వివరాలు తెలుసుకొని,గరిష్ట వేతనం 307 రూపాయలు వచ్చే విధంగా కూలీలకు అవగాహన కల్పించాలని, సిబ్బందినీ ఆదేశిస్తూ, వేసవికాలంలో ఎండల తీవ్రత అధికమవుతున్న సందర్భంగా తప్పనిసరిగా రెండు సార్లు ఫోటో హాజరు తప్పని సరి అయినందున ఉదయమునే ఏడు గంటల లోపు పని ప్రదేశంలోకి వచ్చి 11 గంటల వరకు పని పూర్తి చేసుకోవలసిందిగా కూలీలకు తెలిపారు. అలాగే కూలిలకు , పని ప్రదేశం లో కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయమని పంచాయతీ కార్యదర్శి వినయ్ ని ఆదేశించినారు. అదేవిధంగా గ్రామపంచాయతీ నర్సరీని సందర్శించి తగు సూచనలు చేసినారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నందు ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మండలంలో అన్ని గ్రామాల్లో పనులు అధిక మొత్తంగా పనులు కల్పించాలని , తక్షణమే ప్రణాళికలపై చర్యలు చేపట్టమని కూలీల సంఖ్య పెంచాలని , సూచిస్తూ, ఆదేశాలు జారి చేశారు.

సహాయ గ్రామీణాభివృద్ధి వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. లక్ష్మి, అదనపు కార్యక్రమ అధికారి రాజు గాదెపాక, పంచాయతీ కార్యదర్శులు వినయ్, రాజ్ కుమార్ ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు శ్రీను, అన్వేష్ , అశోక్, మరియు కంప్యూటర్ ఆపరేటర్ జ్యోతి క్షేత్ర సహాయకులు, వెంకన్న పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

- రైతులు ఎవరు ఆ ధైర్య పడొద్దు
- చివరికింది వరకు కొనుగోలు చేస్తాం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



సుల్తానాబాద్ ఏప్రిల్ 22 (మనం న్యూస్): రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రి నగర్, వ్యవసాయ మార్కెట్, కదంబపూర్, సుద్దాల, రేగడి మద్దికుంట గ్రామాలలో సింగిల్ విండోల ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని తెలిపారు. మండలంలో రైతుల మక్కలు అధికంగా పండించారని మక్కలు కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసేందుకు వీలులేదని త్వరలోనే స్థలం చూసి కొనుగోలు కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేస్తామని అన్నారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉందని రైతులెవరు నష్టపోవద్దని సంకల్పంతో కొనుగోలు చేపడుతోందని సుల్తానాబాద్ మండలంలోని 16 కోట్ల పై చీలికు బోనస్ రైతులకు వచ్చిందని తెలిపారు. గత వర్షాకాలంలో 8 కోట్ల 71 లక్షలు వచ్చాయని తెలిపారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారని అన్నారు.



గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కటింగ్ పేరుతో నిలుపు దోపిడి చేశారని 15 కిలోల నుండి 20 కిలోల వరకు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయాలని అలాంటివి ఏవి లేకుండా నేడు ఐదు పసళ్ళు గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేశామని తెలిపారు. రైతులు ప్రభుత్వం సూచించిన విధంగా వరి ధాన్యానికి 15% మ్యాచర్ వచ్చేలా చూడాలని కోరారు. సంబంధిత జిల్లా కలెక్టర్ వ్యవసాయ సింగల్ విండో తదితర అధికారులు అందుబాటులో ఉన్నారని రైతులు ఎవరు ధైర్యపడవద్దని రైతులకు వడగళ్ల వానలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని సంచులు కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు అలాగే రైతుల వివిధ రకాల ధాన్యానికి సంబంధిత రేట్లను సూచించే పట్టికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి దాన్యపు గింజ కొనుగోలు చేస్తామని ఆ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, సాయిరి మహేందర్, శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రామన్న, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్య గౌడ్, దుగ్యాల సంతోష్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘ కార్యదర్శి బూరుగు సంతోష్, మాజీ ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో బస్టాండ్ నిర్మించాలి

### కాళేశ్వరం లో బస్టాండ్ ఓకే మరి మేడారం సంగతి ఏంటి

### టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ దేవా నాయక్



ములుగు, ఏప్రిల్ 22(మనంన్యూస్)ః ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన మేడారం లో 10 కోట్ల రూపాయలతో బస్టాండ్ నిర్మించాలని టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ దేవా నాయక్ డిమాండ్ చేశారు మేడారం ప్రాంతం కు ఎక్కువ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించింది టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే అని ములుగు టైగర్ మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కృషి తోనే ఇదంతా జరిగింది అని ఆ తర్వాత గెలిచినా వాళ్ళు ఫోటో లు దిగడం తప్ప చేసింది శూన్యం అని గత జాతర కు 250 కోట్లు మంజూరు చేసి కమిషన్ లు తిన్నారు కాని కనీసం ఒక బస్టాండ్ కట్టాలి అని సోయి లేదని వచ్చే సంవత్సరం లో జరిగే జాతర అభివృద్ధి కి నిధులు కేటాయించాలని ప్రభుత్వం మేడారం లో మరియు ఊరట్టం స్థూపం దగ్గర కొత్తూరు ఊరట్టంకాలనీ వెంగ్లాపూర్, నార్లపూర్ లలో బస్టాండ్ నిర్మించాలని మర్చిపోయారు అని విమర్శించారు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇస్తూ రైల్వే సౌకర్యం మంజూరు చేసిన స్థానిక రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఎందుకు అంటే ఈ ప్రభుత్వం కు మేడారం అంటే వివక్ష ఉంది కాబట్టి అని అందుకే మేడారం ప్రాంత అభివృద్ధి ని పట్టించుకోవడం లేదని,ఇటీవలే కాళేశ్వరం వెళ్లిన సీఎం కాళేశ్వరం బస్టాండ్ కు 3 కోట్ల 71 లక్షల రూపాయలు మంజూరు చేశారు కానీ ప్రపంచంలో పేరు పొందిన మేడారం కు బస్టాండ్ ఎందుకు మంజూరు చేయలేదో చెప్పాలి అని డిమాండ్ చేశారు త్వరలో కలెక్టర్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ని కలిసి బస్టాండ్ కావాలి వివరిస్తాం అని తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ బండి స్వామి





మల్హర్, ఏప్రిల్ 22(మనం న్యూస్)ః మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించడం జరిగింది తాడిచర్ల. సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న ఈ వేసవిలో ప్రజలకు, ప్రయాణికులకు తాగునీటిని అందించడం చాలా అభినందనీయ మనీ అన్నారు ఎండల తీవ్రత నుండి ఉపశమనం మన చలివేంద్రం ఒక చల్లని వరప్రసాదం పది మంది దాహం తీరినప్పుడు లభించే తృప్తి వేల రూపాయిల సంపద కంటే గొప్పది అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు వార్డ్ సభ్యులు దేవేంద్ర శ్యామల సారయ్య అశోక్ పర్వాన్ బేగం కామ బాబు వన్నమ్మ తిరుపతిరావు సంగీత నిరంజన్ రావు మహేందర్ చంద్రయ్య రాజేశ్వరి మరియు కేసారపు చంద్రయ్య గంగయ్య మేనం రాకేష్ సది సడవలి పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెతో స్తంభించిన ప్రజా రవాణా

- అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె
- కల్వకుర్తి బస్ డిపో వద్ద స్వల్ప ఉద్రిక్త
- బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆర్టీసీ కార్మికుల సమ్మె




కల్వకుర్తి ఏప్రిల్ 22(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి నుండే కల్వకుర్తి డిపో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టారు. దీనితో బస్సులు మొత్తం డిపోకే పరిమితమయ్యాయి. బస్సులు నడవకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మె కార్యక్రమం చేపట్టామని బుధవారం ఆర్టీసీ కార్మికులు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని అదేవిధంగా ఆర్టీసీలో సంస్థలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు బకాయి ఉన్న డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ సంస్థలో పదవి విరమణ పొందిన ఉద్యోగుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని అలాగే ఏవైతే ఎలక్ట్రికల్ బస్సులు తెచ్చి తమకు అన్యాయం జరిగేలా చూశారో ఆ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఆర్టీసీను పూర్తి స్థాయిలో ప్రభుత్వంలోనే విలీనం చేసుకోని కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు పేర్కొన్నారు.

అనంతరం ఆర్టీసీ మహిళా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వానికి మహిళలపై చిత్తశుద్ధి ఉంది అంటున్నారు కానీ ఆర్టీసీలో పని చేస్తున్న మహిళలపై ఎందుకు చిత్తశుద్ధి లేదని వారు ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకాన్ని తాము ఎంతో జాగ్రత్తగా శ్రద్ధగా బస్సులలో పూర్తిగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా విధులు నిర్వర్తిస్తున్నామని అయినా కూడా ప్రభుత్వానికి తమపై కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆర్టీసీ మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించి పని వేళలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

## నేడే వరి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

భీమదేవరపల్లి, ఏప్రిల్ 22 మనం న్యూస్: భీమదేవరపల్లి మండల పరిధిలో గురువారం రోజున వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న టు ఏబీఎన్ వేణు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో కొత్తకొండ, భీమదేవరపల్లి, వంగర, మాణిక్యపూర్, వరి కొనుగోలు కేంద్రాలను ఎలుకతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజ్, వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి తో పాటు మార్కెట్ డైరెక్టర్లు, జిల్లా మండల స్థాయి అధికారులు,ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, రైతులు మహిళలు, ప్రారంభ కార్యక్రమానికి రావాలని కోరారు.

## సెపకతక్రా జాతీయ జట్టు కోచ్‌గా పోరిక. అనిల్ కుమార్



మహబూబాబాద్, ఏప్రిల్ 22 (మనంన్యూస్)ః తేదీ.24-04-2026నుండి 28-04-2026 వరకు జరిగే జాతీయ స్థాయి సేపకతక్రా పోటీలకు తెలంగాణ జట్టు కు కోచ్ గా గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల రెడ్యాల పీడీ పోరిక. అనిల్ కుమార్ ను నియమించారు చాలా మంది పిల్లని జాతీయ స్థాయి పోటీలకు తయారు చేశారు. అందుకు గాను అతని సేవలని గుర్తించి నేషనల్ లెవెల్ కోచ్ గా నియమించారు. అందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా మహబూబాబాద్ సెక్రటరీ సత్యనారాయణ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ . ఐలయ్య మరియు పీడీస్ మరియు పీటిస్ అభినందించారు.

## 2026 - 2027 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్

వరంగల్, ఏప్రిల్ 22 న్యూస్ ః బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌లో వరంగల్ జిల్లాలోని గిరిజన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా, గిరిజన సంక్షేమశాఖ, తెలంగాణ ప్రభుత్వం వారు 2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద 3వ, 5వ మరియు 8వ తరగతులలో ప్రవేశాల కోసం ఉత్తర్వులు జారీ చేసినారు. కావున జిల్లాలోని అర్హులైన గిరిజనులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. అర్హతలు: తల్లిదండ్రుల వార్షిక ఆదాయం: గ్రామీణ ప్రాంతం: రూ.1,50,000/- లోపు పట్టణ ప్రాంతం: రూ.2,00,000/- లోపు విద్యార్థుల ఎంపిక లాటరీ విధానంలో (డ్రా) జరుపబడును. దరఖాస్తు వివరాలు: దరఖాస్తు ఫారములు అందుబాటు: తేది: 22.04.2026 నుండి 29.04.2026 సాయంత్రం 5:00 గంటల వరకు పూర్తి చేసిన దరఖాస్తుల సమర్పణ చివరి తేదీ: 07.05.2026 సాయంత్రం 5:00 గంటల వరకు సీట్ల కేటాయింపు: మొత్తం సీట్లు: 32, 3వ తరగతి: 16 సీట్లు (50%) 5వ తరగతి: 8 సీట్లు (25%) 8వ తరగతి: 8 సీట్లు (25%) మొత్తం సీట్లలో 33% బాలికలకు కేటాయింపు ఉంటుంది. ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే అర్హత (బాలికలకు ఈ నిబంధన వర్తించదు). దరఖాస్తు తీసుకునే మరియు సమర్పించే స్థలం: జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, వరంగల్ అడ్రస్: అంబేద్కర్ భవనం ఎదురుగా, అశోక కాలనీ, హన్మకొండ తప్పనిసరి జత చేయవలసిన పత్రాలు: కుల ధ్రువీకరణ పత్రం (తహసీల్దార్ ద్వారా, మీ సేవ) ఆదాయ ధ్రువీకరణ పత్రం (01.04.2026 తరువాత జారీ అయినది) నివాస ధ్రువీకరణ పత్రం (మీ సేవ ద్వారా) ప్రస్తుత పాఠశాల నుండి బోనాఫైడ్ సర్టిఫికేట్ ఆధార్ కార్డు ప్రతులు ప్రాజెక్ట్ అధికారి ఐ.టి.డి.ఏ, ఏటూరునాగారంఅందజేయాలని తెలిపారు.

## జిల్లా ప్రజలకు సమర్దు డైన నాయకుడు దామోదర్



- లంబాడి న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా నాయక్

ములుగు, ఏప్రిల్ 22(మనంన్యూస్)ః ములుగు జిల్లా లో పేదలకోసం తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రజా ఉద్యమాలు చేసిన పోరాట (మావోయిస్టు పార్టీ) యోధుడు బడే చొక్కారావు ఆలియాస్ దామోదర్ గారికి ములుగు ప్రజలు రాజకీయ స్వాగతం పలుకు తున్నారు కపటనాటక సూత్రదారికి( మోసకారికి) ఆదివాసీ పేరుచెప్పి ఓట్లకోసం ఇక్కడి ఆదివాసీ సమాజానికి నిలువ నీడ లేకుండా చేస్తున్న వారికి ములుగు జిల్లా ప్రజలు తిలోదకాలు ఇవ్వాలని ఇక సెలవు ప్రకటించాలి అని దేవా నాయక్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## మంచి నీటి మోటారును ఏర్పాటు చేయించిన సర్పంచ్





- వేసవిలో ప్రజలకు ఊరటనిచ్చిన సర్పంచ్ హసీనాబాను

మహాదేవపూర్, ఏప్రిల్ 22 మనం న్యూస్ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 3వ వార్డు ప్రజలకు ఎండాకాలంలో మంచినీటి కొరత రాకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి బుధవారం రోజున కొత్త మంచినీటి మోటార్ను ఏర్పాటు చేయించడం జరిగింది. గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కాలనీ వాసుల కష్టాలు ఒక్కసారిగా తొలగిపోయి వారి ముఖాల్లో ఆనందం వెల్లి విరిసెలా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మూడవవార్డులుగ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి మంచినీటి మోటార్ ను ఏర్పాటు చేయించి త్రాగునీటిసమస్యనుపరిష్కరించడం జరిగింది అనంతరం కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. గ్రామాన్ని అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే దృఢ సంకల్పంతో పనిచేస్తున్న సర్పంచ్ సేవలు నిజంగా అభినందనీయం అని గ్రామ ప్రజలుకొనియాడారు. ఈ కార్యక్రమంలో తుంగల శ్రీజ సంతోష్, వార్డు సభ్యులు లావణ్య, గ్రామ

## నూతన బోర్‌ను నిర్మించాలని సర్పంచ్‌కి వినతి పత్రం అందజేత



మహదేవపూర్ ఏప్రిల్ 22 మనం న్యూస్ః మహాదేవపూర్ మండలంలోని ఎడపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం సమావేశంలో భాగంగా సిపిఎం పార్టీ 3వవార్డు మెంబర్ కుమ్మరి దుర్గ భవానివార్డ్ లోని సమస్యల పైన సర్పంచ్ వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా 3వ వార్డ్ మెంబర్ కుమ్మరి దుర్గ భవాని మాట్లాడుతూవార్డ్ సంబంధించి నూతనంగా బోరు ఏర్పాటు చేయాలని నూతనంగా డ్రైనేజ్ నిర్మించాలని అదేవిధంగా ప్రస్తుతం వస్తున్న బోర్ వాటర్ నుంచి శుద్ధ శుద్ధగా వాటర్ వస్తుందని తెలియజేయడం జరిగింది ఈ సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని సంబంధించిన అధికారుల దృష్టికితీసుకువెళ్లాలని ఆమె కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహేష్ తోపాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై విజిలెన్స్ అధికారుల దాడులు

నల్లగొండ, ఏప్రిల్ 22( మనం ప్రతినిధి)ః నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈరోజు మధ్యాహ్నం ఒక్కసారిగా కార్యాలయానికి వచ్చి తలుపులు మూసేసి సోదాలు నిర్వహిస్తు న్నారు. కాంట్రాక్టు గాని, ఔట్ సోర్సింగ్ గాని ఎటువంటి ఐడెంటిటీ లేకుండా రిజిస్ట్రేషన్ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు బయట వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పీ.నగేష్ను వివరాలు తెలుసుకుంటు న్నారు. రికార్డులు, డాక్యుమెంట్లు అంతకుముందు రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను పరిశీలిస్తున్నారు.



## చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు

- నూతన పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్

కామారెడ్డి, ఏప్రిల్ 22 (మనం న్యూస్)ః కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తి వాతావరణం మధ్య పలు అభివృద్ధి కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన కాలక్షేప (ఆశీర్వచన) మండపాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించారు. అలాగే భక్తుల నివాసార్థం నిర్మించిన గృహాలను ప్రారంభించడంతో పాటు మరికొన్ని కాటేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

### ఆలయ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి కావడం పట్ల భక్తులు హర్షం

గత ఏడాది శంకుస్థాపన చేసిన పనులకు ఏడాది వ్యవధిలోనే ప్రారంభోత్సవం జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి కావడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పాత కమిటీ అధ్యక్షులు మరియు పాలకవర్గ సభ్యుల పదవీకాలాన్ని మరో మూడు సంవత్సరాల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్గా శనిగరం కమలాకర్ రెడ్డి కొనసాగుతుండగా, సభ్యులుగా బండారి యాదగిరి రెడ్డి, గట్టగోని రామ గౌడ్, కొత్త కాపు రాజారెడ్డి, పాత లక్ష్మీరాజ్యం, ఎర్రబోయిన దేవయ్య, కందాడి బాల్ రెడ్డి, క్రర్రోల్ల శంకర్ గౌడ్, నల్ల అంజయ్య, చింతల నర్సింలు కొనసాగనున్నారు.




చైర్మన్ కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వేగంగా ఆలయ అభివృద్ధి

ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ., చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం మహిమగల క్షేత్రమని, స్వామివారి అనుగ్రహంతోనే ఆలయ అభివృద్ధికి సేవ చేసే అవకాశం కలిగిందని తెలిపారు. మతభేదాలు లేకుండా భక్తి భావంతో సేవ చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. మండుతున్న ఎండల్లో కూడా భారీ సంఖ్యలో వచ్చిన భక్తులను స్వాగతిస్తూ, ఆలయానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి విశేషంగా జరిగిందని ప్రశంసిస్తూ, అందుకే ఆయనను తిరిగి చైర్మన్గా నియమించామని తెలిపారు. ప్రతి ఆదివారం ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుందని, కోరికలు కోరిన వారికి స్వామివారు వరప్రదుడిగా నిలుస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ షబ్బీర్ అలి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జిల్లా డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు నర్సింగరావు, రమేష్ గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, నౌసి నాయక్, దేవరాజ్ గౌడ్, సుతారి రమేష్, తిరుమల గౌడ్, బల్యాల సుదర్శన్, ఐరెని నరసయ్య, రాజగౌడ్, గంప ప్రసాద్, గోనే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల వద్దకు బడిబాట



భీమదేవరపల్లి, ఏప్రిల్ 22 మనం న్యూస్: భీమాదేవరపల్లి లో ఉపాధి హామీ కూలీల వద్దకు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బుధవారం రోజున మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి హాజరై సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల కంటే దీటైన విద్యా ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ తో పాటు ఉచిత మధ్య భోజన పథకం, మంచినీటిసౌకర్యం, ప్రతిభగల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ప్రతి ఒక్కరు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో అల్పాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లల్ని పంపించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రాజు వార్డు సభ్యులు ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.







# పరిపక్వత లేకపోతే అభిషేక్ నంబర్ వన్ ఎలా అవుతాడు?: వరుణ్ ఆరోన్

ఢిల్లీ క్యాపిటల్స్ పై చివరి వరకూ క్రీజ్ లో ఉన్న అభిషేక్ శర్మ అజేయశతకంతో అదరగొట్టాడు. సన్ రైజర్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు దూకుడుగా ఆడే క్రమంలో అనవసరమైన షాట్లు కొట్టి పెవిలియన్ కు చేరేవాడు. దీంతో అతడి పరిపక్వతపై సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వచ్చాయి. అయితే, ఈ విషయంలో అభిషేక్ ను హైదరాబాద్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ వెనుకేసుకొచ్చాడు. అతడు ఫామ్ ను కోల్పోయిన సమయంలోనూ అతడి పరిణతిలోపాన్ని ప్రశ్నించలేమని వరుణ్ వ్యాఖ్యానించాడు.



''అభిషేక్ శర్మ ఎప్పుడూ పరిణతితోనే ఉంటాడు. గత కొన్నేళ్లుగా అతడి ఆటతీరు ఇలానే ఉంది. ఆ పరిపక్వత లేకపోతే ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 ప్లేయర్ గా ఎదగగలడా? ప్రత్యర్థినిబట్టి, పిచ్ నుబట్టి ఎలా ఆడాలో నిర్ణయించుకుంటాడు. అందుకు ఈ మ్యాచ్ నే చూడాలి. ఈ పిచ్ తొలుత బ్యాటింగ్ కు కాస్త కష్టంగా మారింది. ప్రతి బంతిని ఆచితూచి ఆడాడు. ఇక్కడ ప్రత్యర్థిని గౌరవించాడు. గతంలోనూ ఇలానే వ్యవహరించాడు. అయితే, హైరిస్క్ గేమ్ లో ఒక్కోసారి వర్కౌట్ కాకపోవచ్చు. అందుకే, వెసులుబాటు ఇస్తుండాలి. ప్రతి మ్యాచ్ లోనూ వంద శాతం డెడికేషన్ తో ఆడినా ఫలితం ఒక్కోసారి అనుకూలంగా రాకపోవచ్చు'' అని వరుణ్ ఆరోన్ వెల్లడించాడు.

**మా బౌలర్లు టాలెంటెడ్..**

''ఇతర బౌలర్లతో పోలిస్తే మా కుర్రాళ్ల నైపుణ్యం ఏమాత్రం తగ్గదు. మలింగను తీసుకుంటే బంతిని రివర్స్ చేస్తాడు. ఇది ప్రత్యర్థి బ్యాటర్లకు చాలా కష్టం. ఇక సకిబ్ 140+కి.మీ వేగంతో నిలకడగా బౌలింగ్ చేస్తాడు. స్లో బంతులనూ అద్భుతంగా సంధించగల బౌలర్. ఈ సీజన్ లో మా ప్రణాళిక ఒక్కటే. పిచ్ తో సంబంధం లేకుండా అద్భుతమైన బౌలింగ్ రాబట్టాలి. ఇప్పటికే సకిబ్, మలింగ సాధించారు. గత రెండేళ్లుగా సకిబ్ ను చూస్తున్నా. ఉప్పల్ పిచ్ పై బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం చూస్తుంటే ముచ్చటేస్తోంది'' అని ఆరోన్ తెలిపాడు.

## సన్ రైజర్స్ కెప్టెన్సీ నుంచి ఇషాన్ కిషన్ అవుట్?



ఐపీఎల్-2026లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ కు అదిరిపోయే వార్త అందింది. ఏప్రిల్ 25న జైపూర్ వేదికగా రాజస్తాన్ రాయల్స్ తో జరగనున్న మ్యాచ్ లో ఎస్ఆర్హెచ్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ బరిలోకి దిగనున్నాడు. దీంతో తాత్కాలిక కెప్టెన్ గా వ్యవహరిస్తున్న ఇషాన్ కిషన్ తన బాధ్యతలను కమ్మిన్స్ కు అప్పగించనున్నాడు.కమ్మిన్స్ వెన్ను గాయం కారణంగా ఇప్పటివరకు ఎస్ఆర్హెచ్ ఆడిన ఏడు మ్యాచ్ లకు అందుబాటులో లేడు. అతడు ఇటీవలే క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన ఫిట్ నెస్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఎస్ఆర్హెచ్ క్యాంప్ లో చేరాడు. మంగళవారం ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్తో జరిగిన మ్యాచ్ లోనే కమ్మిన్స్ ఆడుతాడని అంతా భావించారు. కానీ కాస్త అసౌకర్యంగా ఉండడంతో టీమ్ సెలెక్షన్ అందుబాటులేకపోయాడు. అయితే రాజస్తాన్ తో మ్యాచ్ లో మాత్రం కమ్మిన్స్ ఆడడం దాదాపు ఖాయమైంది. అతడు ఇప్పటికే తన ప్రాక్టీస్ ను కూడా మొదలు పెట్టాడు. కాగా కమ్మిన్స్ గైర్హాజరీలో ఇషాన్ జట్టును అద్భుతంగా నడిపించాడు.



# తమ్ముడు హార్దిక్‌తో విభేదాలు.. స్పందించిన కృనాల్ పాండ్య

ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ సమయంలో హార్దిక్ ఔటైన తర్వాత కృనాల్ పాండ్య పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నాడు. అతడిని చూస్తూ హార్దిక్ డగౌట్ కు వెళ్లడం సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ గా మారాయి. దీంతో వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చాయని కొత్త చర్చకు తెర లేపింది. అయితే, వాటిపై వస్తోన్న వార్తలను కృనాల్ కొట్టిపడేశాడు. ఈ వీడియోను ఆర్సీబీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

డానిష్ మిస్టర్ నాగ్స్ అడుగుతూ.. ''మీ ఇద్దరి బంధం బాగుంది కదా? లేకపోతే ఏదైనా గొడవా?'' అని ప్రశ్నించారు. అంతా బాగుందని కృనాల్ సమాధానం ఇచ్చాడు. ఇక లఖ్ నవూ యువ ఆటగాడు ముకుల్ చౌదరిని స్లెడ్జ్ చేశాడంటూ వస్తోన్న ఆరోపణల పైనా కృనాల్ స్పందించాడు.

**స్లెడ్జింగ్ పైనా..** ''ఓ కుర్రాడిని నేను స్లెడ్జ్ చేసినట్లు బయట నుంచి చాలామంది విమర్శిస్తున్నారు. నేను అతడికి బౌలింగ్ చేశా. తొలి బంతికే ప్యాడ్స్ తాకిన వెంటనే ఔట్ కోసం అప్పీలు చేశా. ఆ తర్వాత.. 'ముకుల్ నువ్వు కుర్రాడివి. నా బౌలింగ్ లో నువ్వు సిక్స్ లు కొట్టగలవు. అయితే, లాంగాఫ్ లేదా లాంగాన్ మీదుగా స్టాండ్స్ లోకి పంపించు' అని మాత్రమే అన్నా. నేనెక్కడా స్లెడ్జింగ్ చేయలేదు. అతడు కూడా నవ్వేశాడు. అదంతా సరదాగా అన్నదే. నా స్టైల్ ను చూసి.. నేను చాలా సీరియస్ గా ఉంటానని, నాకు కోపమెక్కువని అనుకుంటారు. కానీ, నేను అలా ఉండను'' అని కృనాల్ వెల్లడించాడు.



## ప్రముఖ నిర్మాత మృతి!

తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. నిర్మాత, విశ్లేషకులు త్రిపురనేని చిట్టిబాబు మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఐతే, చిట్టిబాబు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రముఖ రచయిత త్రిపురనేని మహారథి కుమారుడే చిట్టిబాబు. మొదట కొన్ని సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేశారు. ఆ తర్వాత 'సంతానం' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. మొత్తం 12 సినిమాలకు దర్శకత్వం వహించడమే కాకుండా దాదాపు 30 చిత్రాల్లో తెరపై కూడా కనిపించారు. ఆ తర్వాత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి పలు సినిమాలు నిర్మించారు. ఆయన మరణం పట్ల పలువురు తెలుగు సినీ ప్రముఖులు, ప్రేక్షకులు సంతాపం తెలుపుతూ.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.



## వి.వి.వినాయక్, కోన వెంకట్ ముఖ్య అతిథులుగా 'గేదెలరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్

రఘు కుంచె టైటిల్ పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'గేదెలరాజు' సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్, వి.ఎన్.ఆదిత్య, రచయిత కమ్ ప్రొడ్యూసర్ కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన దర్శకుడు చైతన్య మోటూరి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని, మోటూరి టాకీస్ పతాకంపై వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఈ నెల 24న థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ.. సింగర్, మ్యూజిక్ డైరెక్టర్, నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రఘుకుంచె సోలో హీరోగా చేసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. కొత్త వారైనా సరే, కంటెంట్ బాగుంటే సినిమాలు తప్పకుండా సక్సెస్ అవుతాయని కోన వెంకట్ పేర్కొన్నారు. కుమారుడు చైతన్యపై నమ్మకంతో సినిమా నిర్మించిన తల్లిదండ్రులను వి.ఎన్.ఆదిత్య ప్రత్యేకంగా అభినందించారు.

కాకినాడ పట్టణ నేపథ్యంగా రౌడీయిజం చుట్టూ ఈ కథ తిరుగుతుందని రఘు కుంచె వెల్లడించారు. ముఖ్యంగా సినిమాలో చివరి 20 నిమిషాల ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ లాంటి అగ్ర సంస్థ ఈ చిత్రాన్ని సుమారు వందకు పైగా స్క్రీన్లలో పంపిణీ చేస్తుండటం సినిమాపై ఉన్న అంచనాలను పెంచుతోంది.



## 'కొరియన్ కనకరాజు'పై లేటెస్ట్ అప్ డేట్ !

మెగా హీరో వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో 'కొరియన్ కనకరాజు' సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన యంగ్ బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తోంది. వరుణ్ తేజ్ పై ఓ కామెడీ ఎపిసోడ్ ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రీ క్లైమాక్స్ లో వచ్చే ఈ ఎపిసోడ్ సినిమా మొత్తానికే స్పెషల్ కామెడీ ఎపిసోడ్ లా ఉంటుందట. మేర్లపాక గాంధీ మార్క్ మేకింగ్ తో ఈ ఎపిసోడ్ లో ఫుల్ ఎంటర్ టైన్ గా ఉంటుందట.

అన్నట్టు, ఈ సినిమాలో వరుణ్ తేజ్ కనకరాజు పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఆ మధ్య విడుదలైన గ్లింప్స్ లో వరుణ్ తేజ్ 'నేను తిరిగొచ్చేశా' అంటూ కొరియన్ భాషలో చెప్పడం ఆకట్టుకుంది. ఇంతకీ, ఈ సినిమాకి కొరియన్ భాషకు ఏమిటి సంబంధం అనేది ? సినిమాలో చాలా ఆసక్తిగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది. మరి ఈ సినిమా ఏ రేంజ్ విజయాన్ని సాధిస్తోందో చూడాలి.

# నేను జైలుకు వెళ్లడానికి డబ్బు చెల్లించకపోవడమే కారణం కాదు : రాజ్ పాల్ యాదవ్



బాలీవుడ్ నటుడు రాజ్ పాల్ యాదవ్ చెక్ బౌన్స్ కేసులో ఇటీవల తిహాడ్ జైలుకెళ్లిన విషయం తెలిసిందే. తాను జైలుకు వెళ్లడానికి డబ్బు చెల్లించకపోవడం మాత్రమే కారణం కాదని తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై స్పందించారు. ''నేను ఎంతోమందికి సాయం చేశా. వాటి గురించి కూడా ఇప్పటివరకూ ఎక్కడా ప్రస్తావించలేదు. గత 25 ఏళ్లలో మా గ్రామంలో వారి నుంచి ముంబయిలో ఉన్న ప్రజల వరకూ ఎంతోమంది నాకు అండగా ఉన్నారు. నా కెరీర్ ఇన్నేళ్లుగా సజావుగా సాగడమే అందుకు నిదర్శనం. 250 చిత్రాల్లో నటించా. పరిశ్రమ నాకు అండగా నిలవకపోతే ఇన్ని సినిమాలు ఎలా చేయగలను?. ఇన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నాకు కేవలం రూ.5 కోట్లు చెల్లించడం పెద్ద విషయం కాదు. నేను జైలుకు వెళ్లడానికి ఆ డబ్బు చెల్లించకపోవడం మాత్రమే కారణం కాదు. అదే సమస్య అయితే 2012లోనే ఇది పరిష్కారం అయ్యేది'' అని చెప్పారు. వివాదానికి కారణం గురించి మాట్లాడుతూ.. ''ఒక సినిమా కోసం అప్పటికే రూ.12 కోట్లు ఖర్చు పెట్టాం. మొదట అనుకున్న దానికంటే బడ్జెట్ రూ.22 కోట్లకు చేరింది. దీంతో వివాదం మొదలైంది. ఏ వ్యాపారంలో నైనా ఎదురుదెబ్బలు సహజం. సినిమా పరిశ్రమలో 100 సినిమాలకు 20 మాత్రమే విజయం సాధిస్తాయి. 80 విఫలం అవుతాయి. సినిమాకు ప్రేక్షకాదరణ దక్కకపోయినంతమాత్రాన అందులో మోసం జరిగినట్లు కాదు కదా. నాకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. ఈ పోరాటాన్ని నేను ప్రారంభించలేదు.. కానీ, ముగింపు మాత్రం నేను ఇస్తాను'' అని అన్నారు.



## నెగిటివ్ పాత్రలో డింపుల్ హయాతి?

మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతుంది. చిరంజీవి కెరీర్ లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా పై ఓ క్రేజీ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ సినిమాలో బోల్ బ్యూటీ డింపుల్ హయాతి ఓ పాత్రలో కనిపిస్తోందట. ఐతే, ఆమెది హీరోయిన్ పాత్ర కాదు అని, ఓ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో డింపుల్ నటిస్తోందని తెలుస్తోంది. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ కోసం మెగాస్టార్ సరికొత్త లుక్ లో కనిపించబోతున్నాడు.

పైగా ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని KVN ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్ లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.

# ఆ విషయంలో చాలా బాధపడ్డా: మమితా బైజు



'ప్రేమలు' సినిమాతో యువతను అమితంగా ఆకట్టుకున్న మలయాళ నటి మమితా బైజు. ప్రస్తుతం తమిళంలో వరుస సినిమాలు చేస్తున్నారు. విజయ్ హీరోగా తెరకెక్కిన 'జన నాయగన్'లో కీలక పాత్ర పోషించారు. విడుదల వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం ఇటీవల ఆన్లైన్ లో లీక్ అయిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలిసి చాలా బాధపడ్డానని మమిత తెలిపారు. ఒక్క సినిమా వెనుక ఎంతోమంది కష్టం దాగుంటుందని, అది ఎప్పుడూ వృథా కాకూడదన్నారు. ''జన నాయగన్ లీక్ గురించి నా సోదరుడి ద్వారా తెలిసింది. తొలుత నమ్మలేదు. ఎందుకంటే సోషల్ మీడియాలో వినిపించేవన్నీ వాస్తవాలు కాదు కదా. ఉద్దేశపూర్వకంగా కొందరు ప్రచారం చేస్తున్నారనుకున్నా. కానీ, అది నిజం కావడం దురదృష్టకరం'' అని పేర్కొన్నారు. తాను హీరోయిన్ గా నటించిన 'కర' ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

'కర' గురించి చెబుతూ.. ''ధనుష్ సినిమా కోసం చాలా కష్టపడుతుంటారు. రోజంతా పని చేసినా ఆయన అలసిపోవడం చూడలేదు. పని పట్ల ఎంత నిబద్ధతగా ఉండాలన్నది ఆయన్ను చూసి నేర్చుకున్నా. రొటీన్ పాత్రలకు ఆయనెప్పుడూ దూరంగానే ఉంటారు. ప్రేక్షకులకు కొత్త కథలు, పాత్రలు పరిచయం చేస్తుంటారు. ఆయన సినిమాల్లో 'వీఐపీ' (తెలుగులో రఘువరన్ బీటెక్) బాగా ఇష్టం'' అని తెలిపారు. ధనుష్ హీరోగా విఘ్నేశ్ రాజా తెరకెక్కించిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ 'కర' ఈనెల 30న విడుదల కానుంది. తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' లోనూ మమితే హీరోయిన్. ఈ మూవీ స్టోరీ వినగానే ఎంతగానో నచ్చిందని, ఈ ఛాన్స్ మిస్ చేసుకోకూడదనుకుని వెంటనే నటించేందుకు అంగీకరించానని తెలిపారు. మరో తమిళ్ మూవీ, ఓ మలయాళ సినిమాలో ఆమె నటిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.